RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

**బీమా రంగంలో వందశాతం విదేశీప్రత్యక్ష పెట్టుబడులు**

2

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 102 | మే 04 సోమవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 102 | May 04 Monday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |

# తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు



**హైదరాబాద్ / అమరావతి జనసంఘర్షణ**
తెలంగాణలో ఎండలు మండుతున్నాయి. ఉదయం నుంచే భానుడు ప్రతాపం చూపిస్తుండడంతో బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఈ క్రమంలో వాతావరణశాఖ తీపికబురు చెప్పింది. వారం రోజులు పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రాగల రెండురోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతల్లో ఎలాంటి మార్పు ఉండదని, ఆ తర్వాత రెండు నుంచి మూడు డిగ్రీలు క్రమంగా తగ్గుతాయని పేర్కొంది. ఆదివారం కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలున్నాయని తెలిపింది.
సోమవారం గంటకు 30 నుంచి 40 మీటర్ల వేగంతో గాలులు వీస్తూ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, నాగర్ కర్నూల్ జిల్లాలో వర్షాలు పడుతాయని అంచనా వేసింది. మంగళవారం భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండలో భారీ వర్షాలు కురుస్తాయని, ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని ➤ మిగతా 2వ పేజిలో..

ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం ప్రస్తుతం అత్యంత భిన్నంగా మారుతోంది. ఒకవైపు భానుడి భగభగలతో జనం అల్లాడుతుంటే, మరోవైపు అకస్మాత్తుగా కురిసే పిడుగులతో కూడిన వర్షాలు భయాందోళనకు గురిచేస్తున్నాయి. రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తాజా నివేదిక ప్రకారం, రాష్ట్రంలో ఎండల తీవ్రత రికార్డు స్థాయికి చేరుకుంది. గూడూరులో రికార్డు స్థాయి ఉష్ణోగ్రత రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఎండలు తీవ్రస్థాయిలో మండిపోయాయి. ముఖ్యంగా నెల్లూరు జిల్లాలోని గూడూరులో అత్యధికంగా 46.2డిగ్రీ ఉష్ణోగ్రత నమోదై ఈ సీజన్లోనే రికార్డు సృష్టించింది. ప్రకాశం జిల్లాలోని కొప్పెరపాడులో 46.1డిగ్రీ, కంబంలో 45.7డిగ్రీ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దాదాపు 286 మండలాల్లో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలు దాటడంతో జనం ఇంటి నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. వేడి గాలుల ప్రభావంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. 27 మండలాల్లో వడగాల్పుల హెచ్చరిక సోమవారం వాతావరణం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, నెల్లూరు జిల్లాల్లోని 27

➤ మిగతా 2వ పేజిలో..

# లెబనాన్‌పై భీకర దాడులు



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైన్యం మరోసారి భీభత్సం సృష్టించింది. ఇరు పక్షాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అత్యంత బలహీనంగా మారిన నేపథ్యంలో, శనివారం ఇజ్రాయెల్ వైమానిక దాడులు తీవ్రతరం చేసింది. హిజ్బుల్లా లక్ష్యాలే టార్గెట్ ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, శనివారం ఒక్కరోజే దక్షిణ లెబనాన్‌లోని హిజ్బుల్లాకు చెందిన 70 సైనిక నిర్మాణాలు, సుమారు 50 మౌలిక సదుపాయాల కేంద్రాలను ధ్వంసం చేసినట్లు తెలిపింది. కాల్పుల విరమణ ➤ మిగతా 2వ పేజిలో..

# ఐదు రాష్ట్రాల నేడే రిజల్ట్స్

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు రేపు మే 4, 2026న వెలువడనున్నాయి. ఈనేపథ్యంలో దేశమంతటా ఆసక్తి నెలకొన్నది. సోమవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుతో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఉదయం 8.30 నుంచి ఈవీఎంల లెక్కింపు ప్రారంభమవుతుంది. పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాల ఫలితాలపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా బెంగాల్‌లో అధికార పార్టీ, ప్రతిపక్షాల మధ్య హోరాహోరీ పోరు కొనసాగుతోంది. కేరళ, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్ర బలగాలతో మూడంచెల భద్రతను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. పశ్చిమ బెంగాల్‌లో 77 కౌంటింగ్ కేంద్రాలు, తమిళనాడులో 62, కేరళలో 43, అస్సాంలో 40, పుదుచ్చేరిలో 6 కౌంటింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు.

## మే 4 నుండి మే 9 వరకు

# రైతు వారోత్సవాలు

## రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్ జనసంఘర్షణ**
ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మే 4 నుండి మే 9 వరకు రైతు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులతో ప్రత్యక్షంగా మమేకమవుతూ, వివిధ శాఖల సమన్వయం ద్వారా ప్రభుత్వ పథకాలు, సాంకేతికతలు, సేవలను చివరి రైతు వరకు చేరవేయడం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రైతు వారోత్సవాలు రైతుల ఇంటి వద్దకే చేరే కార్యక్రమంగా రూపొందించబడినవని మంత్రి తెలిపారు. వ్యవసాయం, అనుబంధ శాఖల సమిష్టి కృషితో రాబోయే వ్యవసాయ సీజన్‌కు రైతుల్లో ➤ మిగతా 2వ పేజిలో..



# పవన్ కల్యాణ్‌కు సీఎం చంద్రబాబు పరామర్శ



**అమరావతి జనసంఘర్షణ**
ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరామర్శించారు. ఇటీవల పవన్ కళ్యాణ్‌కు సర్జరీ జరగడంతో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. సర్జరీ తర్వాత పవన్ ఆరోగ్యం ఎలా ఉంది? వైద్యులు ఎటువంటి జాగ్రత్తలు సూచించారు? అన్న విషయాలను చంద్రబాబు ఆత్మీయంగా అడిగి తెలుసుకున్నారు. దాదాపు అరగంట పాటు సాగిన ఈ భేటీలో పవన్ ఆరోగ్యంపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. విశ్రాంతి తీసుకోవాలని

➤ మిగతా 2వ పేజిలో..

# తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

**మొదటిపేజీ తరువాయి..** పేర్కొంది. అలాగే, ఆసిఫాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, జనగాం, సిద్ధిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది.

అలాగే, బుధవారం పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. అలాగే, ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని పేర్కొంది. అలాగే, గురువారం నుంచి శనివారం వరకు పలుచోట్ల భారీ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వానలు కొనసాగుతాయని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## ఏపీలో..

మండలాల్లో తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు వడదెబ్బకు గురికాకుండా ఉండటానికి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు.

ఒకవైపు ఎండలు మండుతుంటే, మరోవైపు ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. కాకినాడ, అనకాపల్లి, కోనసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశం ఉంది. పిడుగులు పడే సమయంలో ప్రజలు చెట్ల కింద గానీ, విద్యుత్ స్తంభాల వద్ద గానీ ఉండవద్దని హెచ్చరించారు. ఈ అకాల వర్షాలు మరియు వడగాల్పుల ప్రభావంతో అటు సామాన్య జనం, ఇటు పంట కోత దశలో ఉన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

# లెబనాన్‌పై భీకర దాడులు

**మొదటిపేజీ తరువాయి..** నిబంధనలను హిజ్బుల్లా ఉల్లంఘిస్తోందని, దానికి ప్రతిస్పందనగానే ఈ దాడులు నిర్వహిస్తున్నామని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది.

ప్రాణనష్టం మరియు తరలింపు ఆదేశాలు

లెబనాన్ అధికారిక వార్తా సంస్థ కథనం ప్రకారం.. టైర్ జిల్లాలోని సమ్మయ్యే అనే పట్టణంలో ముగ్గురు వ్యక్తులు మరణించారు. దాడులు ప్రారంభించడానికి ముందే ఇజ్రాయెల్ తొమ్మిది గ్రామాల ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు, హిజ్బుల్లా కూడా ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా సరిహద్దుల్లోని ఇజ్రాయెల్ బలగాలను లక్ష్యం చేసుకుని రాకెట్లతో విరుచుకుపడింది.

కొనసాగుతున్న ఉద్రిక్తతలు

ఏప్రిల్ 17న కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం రెండు దేశాల మధ్య శాంతి నెలకొంటుందని భావించినా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి.

లెబనాన్ సైన్యం - అమెరికా జనరల్ భేటీ: లెబనాన్ ఆర్మీ చీఫ్ రోడాల్ఫ్ హైకల్ శనివారం అమెరికా జనరల్ జోసెఫ్ క్లియర్‌ఫీల్డ్‌తో సమావేశమయ్యారు. 2024 నాటి శాంతి ఒప్పందం అమలుపై ఈ ఐదుగురు సభ్యుల కమిటీ పర్యవేక్షణ పెంచడంపై వారు చర్చించారు.

యుద్ధ తీవ్రత: మార్చి 2న ప్రారంభమైన ఈ యుద్ధంలో ఇప్పటివరకు లెబనాన్‌లో 2,600 మందికి పైగా మరణించగా, 10 లక్షల మందికి పైగా నిరాశ్రయులయ్యారు.

# పవన్ కల్యాణ్‌కు సీఎం చంద్రబాబు పరామర్శ

**మొదటిపేజీ తరువాయి..** సీఎం సూచన శస్త్రచికిత్స అనంతరం పవన్ కళ్యాణ్ కాస్త నీరసంగా ఉండటాన్ని గమనించిన చంద్రబాబు, ఆయనకు కీలక సూచనలు చేశారు. రాష్ట్ర పాలనలో పవన్ కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, ప్రస్తుతానికి ఆరోగ్యంపైనే దృష్టి పెట్టాలని, తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. "ప్రజా సేవలో మీ అవసరం రాష్ట్రానికి ఎంతో ఉంది, కాబట్టి పూర్తిస్థాయిలో కోలుకున్న తర్వాతే విధుల్లోకి రావాలి" అని చంద్రబాబు హితవు పలికారు. కూటమి ప్రభుత్వంలో ఇద్దరు అగ్రనేతల మధ్య ఉన్న ఈ ఆత్మీయ సంబంధం మరియు ఒకరి ఆరోగ్యం పట్ల మరొకరు కనబరుస్తున్న బాధ్యత కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతోంది.

ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కళ్యాణ్, ఇంకొద్ది రోజుల్లోనే అమరావతికి తిరిగి వచ్చే అవకాశం ఉంది. శస్త్రచికిత్స విజయవంతం కావడంతో ఆయన త్వరగా కోలుకుంటున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మరియు అటవీ శాఖల బాధ్యతలను నిర్వహిస్తున్న పవన్, విశ్రాంతి సమయంలో కూడా కీలక దస్త్రాలను పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. పవన్ కళ్యాణ్ ఆరోగ్యంగా తిరిగి వచ్చి, మళ్ళీ ప్రజా క్షేత్రంలో చురుగ్గా పాల్గొనాలని అటు జనసైనికులు, ఇటు తెలుగుదేశం శ్రేణులు ఆకాంక్షిస్తున్నాయి.

# మే 4 నుండి మే 9 వరకు రైతు వారోత్సవాలు

మొదటిపేజీ తరువాయి.. నమ్మకం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఆయన వివరించారు. శాఖల మధ్య సమన్వయం సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్లు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తూ కార్యక్రమాల అమలు నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ప్రతి రోజును ఒక ప్రత్యేక శాఖకు కేటాయించి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. మొదటి రోజు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మట్టి ఆరోగ్యం, సమతుల ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. రెండో రోజు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పంటల విభిన్నీకరణ, మైక్రో ఇరిగేషన్ వంటి అంశాలపై కార్యక్రమాలు జరుగుతాయని, మూడో రోజు సహకార, మార్కెటింగ్ శాఖల ద్వారా మార్కెట్ లింకేజులు, రుణ సదుపాయాలపై వివరాలు అందిస్తామని పేర్కొన్నారు.

నాలుగో రోజు యాంత్రీకరణ, డ్రోన్ల వినియోగం, సౌర శక్తి పరిష్కారాలపై ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐదో రోజు పశుసంవర్థక, మత్స్య శాఖలు పశు ఆరోగ్యం, చేపల ఉత్పత్తి పెంపుపై అవగాహన కల్పిస్తాయని, చివరి రోజు సాగునీటి శాఖ వర్షాకాలానికి ముందస్తు చర్యలు, నీటి వనరుల నిర్వహణపై మార్గనిర్దేశనం చేస్తుందని మంత్రి వివరించారు.

మే 4న ఈ రైతు వారోత్సవాలను తాండూరులో మంత్రి తుమ్మల ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా, ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ౧+ రాతీస్త్రుఅఱఎం ఖజూజూ ను ఆవిష్కరించి సేంద్రియ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ఒక పటిష్ట వ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే రైతు వారోత్సవ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆధునిక సాంకేతిక ప్రదర్శనలు ఈ వారోత్సవాలలో ముఖ్య ఆకర్షణలుగా నిలుస్తాయని, రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు.

# ఫోన్ ట్యాప్ చేసిన వారే విమర్శలు చేస్తే ఎలా

### బిఆర్ఎస్‌కు ఎమ్మెల్యే దానం కౌంటర్

**హైదరాబాద్, మే2 :** ఫోన్ ట్యాపింగ్ చేసిన వారే ఇప్పుడు ఫోన్ ట్యాపం అంటూ ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎద్దేవా చేశారు. గతంలో జరిగిన ఫోన్ ట్యాప్ వ్యవహారంపై సమాధానం చెప్పాలన్నారు. కానీ దానికి సమ్మాదనం చెప్పకుండా బురదజల్లడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నేతలు కావాలనే రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని దానం నాగేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలకు అత్యుత్సాహం ఎక్కువైందని విమర్శించారు. . ఈ ప్రభుత్వానికి ఆర్థికభారం ఉన్నా ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని చెప్పుకొచ్చారు. రైతులకు ఈ ప్రభుత్వం రైతు భరోసా ఇస్తోందని.. గతంలో ఇవ్వకపోవడం కంటే ఇప్పుడు ఆలస్యంగానైనా ఇవ్వడం మంచిదే కదా అని చెప్పారు. ఎవరినీ వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టాలని ఈ ప్రభుత్వానికి లేదని చెప్పుకొచ్చారు. శనివారంహైదరాబాద్‌లో దానం నాగేందర్ మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రజానాయకుడు.. ఆయన ప్రజల్లో ఉంటారని.. సందర్భాన్ని బట్టి బయటకు వస్తారని చెప్పుకొచ్చారు. కవిత కలలు కనాలి కానీ కబుర్లు చెప్పొద్దని ఎద్దేవా చేశారు. సొంత తండ్రిని విమర్శించడం ఆమెకు తగదని హితవు పలికారు. తల్లిదండ్రులను గౌరవించలేని వాళ్లు ఏం మనుషులని ప్రశ్నించారు. కవిత తన ఇంటి సమస్యను బయటకు తీసుకువస్తోందని అన్నారు. ఆమె రాజకీయంగా మాట్లాడాలి కానీ సొంత తండ్రిని విమర్శించడం ఏంటి? అని మండిపడ్డారు. కేసీఆర్‌ను కవిత డీ మోరల్ చేస్తూ.. పెద్దాయనను ఇబ్బంది పెట్టడం తగదని దానం నాగేందర్ పేర్కొన్నారు.

# అర్థరాత్రి యువకుడిపై దాడి

### ప్రాణాలు పోయేలా కొట్టి పడేసిన దుండగులు

### ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో యువకుడికి చికిత్స

**వనపర్తి,మే2 :** వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో శుక్రవారం అర్థరాత్రి దారుణ ఘటన జరిగింది. శివ (27 ) అనే యువకుడిపై గుర్తు తెలియని దుండగులు దాడి చేసి, ఆయన కాళ్లు, చేతులను విరగొట్టి, తల పగలగొట్టి ఇంటి ముందు పడవేశారు. ఈ సంఘటన గ్రామంలో కలకలం రేపింది. స్థానికుల సమాచారం మేరకు.. అర్ధరాత్రి సమయంలో కొందరు వ్యక్తులు యువకుడిని బయటకు తీసుకెళ్లి తీవ్రంగా కొట్టినట్లు సమాచారం. అనంతరం గాయాలతో ఉన్న శివను ఇంటి ముందు వదిలి వెళ్లిపోయారు.

విషయం గమనించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే గాయపడిన యువకుడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం శివ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. యువకుడిపై దాడికి గల కారణాలపై అన్ని కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. గ్రామంలో ఈ ఘటనతో భయాందోళనలు నెలకొన్నాయి. పోలీసులు త్వరగా నిందితులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# బీమా రంగంలో వందశాతం విదేశీప్రత్యక్ష పెట్టుబడులు

### ఎల్ఐసిలో మాత్రం 20శాతానికే పరిమితం

### చట్టానికి చేసిన మార్పులపై కేంద్రం నోటిఫై

**న్యూఢిల్లీ, మే2 :** బీమా రంగంలో ఆటోమేటిక్ రూట్‌లో 100 శాతం ఎఫ్‌డీఐ అంటే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తూ చట్టానికి చేసిన మార్పులను కేంద్రం తాజాగా నోటిఫై చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అయితే, ఎల్ఐసీలో మాత్రం ఈ తరహా పెట్టుబడులు 20 శాతానికి పరిమితమని కూడా ఆర్థిక శాఖ తన ప్రకటనలో స్పష్టం చేసింది. దీంతో, విదేశీ పెట్టుబడి దారులు భారతీయ ఇన్సూరెన్స్ కంపెనీల్లో నేరుగా పెట్టుబడి పెట్టేందుకు మార్గం సుగమమైంది. అయితే, ఈ పెట్టుబడులకు ఐఆర్‌డీఏ అనుమతులు అవసరమని కూడా ఆర్థిక శాఖ తన ప్రకటనలో తెలిపింది. బీమా కంపెనీల్లో ఆటోమేటిక్ రూట్‌లో విదేశీ పెట్టుబడులను 74 శాతం నుంచి 100 శాతానికి పెంచుతూ పార్లమెంటు గతేడాది కొత్త బిల్లును ఆమోదించిన విషయం తెలిసిందే. సబ్కా బీమా సబ్కీ రక్షా బిల్లు పేరిట ఇన్సూరెన్స్ చట్టంలో సవరణలకు పార్లమెంటు ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లుతో ఇన్సూరెన్స్ రంగంలోకి మరిన్ని పెట్టుబడులు వస్తాయని అన్నారు. దేశ నలుమూలలకూ ఇన్సూరెన్స్ సేవలు విస్తరిస్తాయని చెప్పారు. ఇప్పటికే విదేశీ పెట్టుబడులకు మార్గాలు ఉన్నప్పటికీ చేయాల్సింది ఇంకా ఎంతో ఉందని కూడా ఆర్థిక మంత్రి అభిప్రాయపడ్డారు. వివిధ కారణాలతో భారత్‌లో భాగస్వామ్య కంపెనీలు లభించక మిన్నకుండి పోయిన విదేశీ కంపెనీలు దేశంలోకి వస్తాయని చెప్పారు. ఇది అంతిమంగా వినియోగదారులకు లాభం చేకూరుస్తుందని మంత్రి అన్నారు. ఈ రంగంలో పోటీ పెరిగి

# బతుమ్మకుంట ముమ్మాటికీ చెరువే

### అక్కడ చెరవు పదెకరాల్లో ఉన్నట్లు నాసా చిత్రాలు ఉన్నాయి

### ఎడ్ల సుధాకర్ హైకోర్టుకు వెళ్లడంపై హైడ్రా కమిషనర్ వివరణ

**హైదరాబాద్, మే2 :** హైదరాబాద్ బతుకమ్మ కుంట చెరువు భూమి తనదే అని, అక్కడ తాను వ్యవసాయం కూడా చేసినట్లు హైకోర్టును ఎడ్ల సుధాకర్ ఆశ్రయించిన క్రమంలో అందుకు ఆధారాలు లేవని, అయినా చెరువును ఆక్రమించి వ్యవసయాం చేయడం కూడా నేమేనని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. ఈ అంశం ఇటీవల పెద్దఎత్తున చర్చకు తెరలేపింది. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ తాజాగా స్పందించారు. బతుకమ్మ కుంటను హైడ్రా అభివృద్ధి చేయడంపై ఎడ్ల సుధాకర్ పిటిషన్ వేశారని తెలిపారు. 1986 నాటి అన్ రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్ మాత్రమే ఆయన వద్ద ఉందని.. రిజిస్టర్డ్ అగ్రిమెంట్ ఉంటేనే రూల్ ప్రకారం చెల్లుబాటు అవుతుందని రంగనాథ్ అన్నారు. బతుకమ్మ కుంట అభివృద్ధిపై డివిజన్ బెంచ్‌కు సుధాకర్ వెళ్లారని.. కంటెంప్ట్ ఆర్డర్‌లో కోర్టు తమను తప్పుపట్టిందని హైడ్రా కమిషనర్ చెప్పారు. డివిజన్ బెంచ్ ఆదేశాల ప్రకారం అక్కడ బోర్డులు, ఇతర నిర్మాణాలు తొలగించామని వెల్లడించారు. హైకోర్టు ఆదేశాలను తాము పాటిస్తామని స్పష్టం చేశారు. సుధాకర్ అసలు అక్కడ చెరువే లేదని అంటున్నారని.. కానీ 1990 నాటి నాసా శాటిలైట్ ఫొటోల్లో బతుకమ్మ కుంట కనిపిస్తోందన్నారు. 1970లో భారతీయ సర్వే ఆఫ్ ఇండియా నీటి సర్వేల్లోనూ పూర్వం నుంచే చెరువు ఉన్నట్లు తేలిందన్నారు. ఎర్రకుంట పేరుతో 1975 పహనీలలో 563/-1తో బతుకమ్మ కుంట ఉందన్నారు. సుధాకర్ భూమిని చెరువుగా మార్చామనేది నిజం కాదని.. తమ వద్ద ఉన్న అన్ని ఆధారాలను కోర్టుకు సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు నార్సింగ్‌లోని ముష్కిమ్ చెరువు ఆక్రమణ కూల్చివేతలపై ముందుగానే సమాచారం ఇచ్చామని హైడ్రా కమిషనర్ తెలిపారు. సున్నం చెరువు బాధితులతో సమావేశం ఏర్పాటు చేశామని.. సీఎం ఆదేశాలతో వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కూడా ఇస్తున్నట్లు వెల్లడించారు. ఐలాపూర్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమణలపైనా డ్రైవ్ చేసినట్లు చెప్పుకొచ్చారు. ఇప్పటివరకూ హైడ్రా 2,093 ఎకరాల భూమిని రికవరీ చేసిందన్నారు. ఇప్పుడున్న మార్కెట్ ధర ప్రకారం ఆ భూముల విలువ రూ.80 వేల కోట్ల వరకు ఉంటుందని రంగనాథ్ తెలిపారు. హైడ్రా పరిధిలో 90 ఎఫ్ఐఆర్‌లు ఇప్పటివరకు నమోదయ్యాయని వెల్లడించారు. ఫాతిమా కాలేజ్ విషయంలో హైకోర్టు ఆదేశాలతో ఎఫ్‌టీఎల్ డిమార్కింగ్ చేయాలని రంగనాథ్ చెప్పుకొచ్చారు.

# సింగపూర్‌లో విద్యావిధానం అమలు

### పర్యటనకు 37మంది టీచర్ల ఎంపిక

### 4 నుంచి 9 వరకు పర్యటించనున్న బృందం

**అమరావతి, మే2 :** ఏపీలోని ఉత్తమ ఉపాధ్యాయులను అంతర్జాతీయ స్థాయి విద్యా వ్యవస్థలను అధ్యయనం చేయించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఏపీ ఉపాధ్యాయుల బృందం.. సింగపూర్‌కు వెళ్లనుంది. ఈ నెల 4 నుంచి 9 వరకు సింగపూర్‌లో ఈ బృందం పర్యటించనుంది. సింగపూర్ పర్యటనకు ఏపీలో 37 మంది ఉత్తమ ఉపాధ్యాయులతో బృందాన్ని ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. సింగపూర్‌లో అత్యాధునిక విద్యా విధానాలు, బోధనా పద్ధతులు, పాఠశాలల్లో అమలవుతున్న వినూత్న ప్రయోగాలు, విద్యార్థుల అభివృద్ధి వ్యవస్థలను ఉపాధ్యాయులు సమగ్రంగా అధ్యయనం చేయనున్నారు. ఇప్పటికే ఈ బృందం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. అక్కడి నుంచి సింగపూర్‌కు విమానం ద్వారా ప్రయాణించనున్నారు. మిగిలిన ఉత్తమ ఉపాధ్యాయులను అధ్యయనం కోసం త్వరలో ఫిన్లాండ్‌కు పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాథమిక విద్యలో ప్రపంచానికే ఫిన్లాండ్ ఆదర్శంగా నిలిచింది. ఈ రెండు దేశాల అనుభవాలను వినియోగించి ఏపీలో విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయాలనేది ప్రభుత్వ ఆలోచన.

# కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లిపై పరువనష్టం కేసు

### మాజీమంత్రి షబ్బీర్ అలీ కుమారుడు ఇలియాస్ దాఖలు

**కామారెడ్డి, మే2 :** కామారెడ్డి ఎమ్మెల్యే తాటిపల్లి వెంకటరమణారెడ్డికి నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు పరువు నష్టం దావా నోటీసులు జారీ చేసింది. ఈ విషయాన్ని హైకోర్టు న్యాయవాది సుమంత్ వెల్లడించారు. శనివారం మీడియాతో న్యాయవాది మాట్లాడుతూ.. కేసు వివరాలను తెలియజేశారు. గత ఫిబ్రవరి 17, 21 తేదీల్లో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ కుమారుడు ఇలియాస్‌పై అత్యాచారం కేసు ఉందని అనుచిత వ్యాఖ్యలు చేశారని, నిరాధార ఆరోపణలు చేశారని న్యాయవాది తెలిపారు. వాస్తవాలు వక్రీకరించి తన పరువుకు నష్టం కలిగించారని, ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇలియాస్ కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. దీంతో ఫిర్యాదు పూర్వాపరాలను పరిశీలించిన కోర్టు.. క్రిమినల్ డిఫెన్స్ కింద ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని ఈ నెల 20న ప్రత్యక్షంగా హాజరుకావాలని నోటీసులు జారీ చేసినట్లు న్యాయవాది సుమంత్ పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో స్థానిక న్యాయవాదులు సతీష్, స్టీఫెన్ నాగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ముదినేపల్లి మండలంలో రోడ్డు ప్రమాదం

### పెళ్లి కోసం వచ్చి ప్రాణాలు కోల్పోయిన టెక్కీ

**ఏలూరు, మే2 :** ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం చినపాలపర్రు జాతీయ రహదారిపై ప్రమాదం చోటు చేసుకుంది. ఆగి ఉన్న టిప్పర్‌ను కారు ఢీ కొన్న ఘటనలో అమెరికాలో ఉంటున్న టెక్కీ జయరాం (27) ప్రాణాలు కోల్పోయాడు. వనదుర్రు గ్రామానికి చెందిన జయరాం.. తన బంధువుల ఇంట్లో జరిగిన వివాహానికికై హజరై తిరిగి అమెరికా వెళ్లేందుకు.. శనివారం తెల్లవారు జామున రోడ్డు మార్గంలో హైదరాబాద్ పయనమయ్యాడు. కారు డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటంతో చినపాలపర్రు సమీపంలో కారు రోడ్డుకు అపసవ్యదిశలో ప్రయాణించి రోడ్డు పక్కన ఆగి ఉన్న టిప్పర్‌ను బలంగా ఢీ కొట్టింది. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. అందులో చిక్కుకున్న జయరాం అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

# సికింద్రాబాద్ మోడీ సభను జయప్రదం చేయండి

❑ **బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి**

ఇల్లందు మే 3 (జన సంఘర్షణ)
ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 10వ తేదీన సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్ భవన్‌లో జిల్లా అధికార ప్రతినిధి దోమల మహేశ్వర్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు సంబంధించిన ఏర్పాట్లు, జన సమీకరణపై నాయకులకు ఆయన దిశానిర్దేశం చేశారు. నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి తెలంగాణ రాష్ట్రానికి వస్తున్నారని, ఈ పర్యటన రాష్ట్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. సుమారు 8,000 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని వెల్లడించారు. అభివృద్ధి కార్యక్రమాల అనంతరం సాయంత్రం 4 గంటలకు పెరేడ్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభలో మోడీ ప్రసంగిస్తారని ఆయన తెలిపారు. ఈ చారిత్రాత్మక సభకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి సుమారు 3,000 మంది కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఇల్లందు నియోజకవర్గం నుండి భారీగా జన సమీకరణ జరగాలని, ఇందుకోసం ప్రతి మండల అధ్యక్షుడు ప్రత్యేక శ్రద్ధ వహించి కార్యకర్తలను సమాయత్తం చేయాలని ఆదేశించారు. మోడీ పర్యటన ద్వారా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో రాజకీయ మార్పుకు ఈ బహిరంగ సభ నాంది పలుకుతుందని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడానికి ఇది పునాది అవుతుందని ప్రభాకర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని రాక కోసం ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని సభను గ్రాండ్ సక్సెస్ చేయాలని నాయకులను కోరారు. మండల స్థాయి నుండి క్షేత్రస్థాయి వరకు సమన్వయంతో



పనిచేయాలని సూచించారు. ఈ సన్నాహక సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మావునూరి మాధవ్, మహిళా మోర్చా నాయకురాలు పెద్దబోయిన సునీత, ఇల్లందు మండల అధ్యక్షులు బట్టు రమేష్, పట్టణ అధ్యక్షురాలు సుచిత్ర పాసి పాల్గొన్నారు. వారితో పాటు టేకులపల్లి, బయ్యారం, గార్ల మండలాల అధ్యక్షులు శంభు నాయక్, నాయిని శ్రీనివాస్, శివకృష్ణ, నాయకులు జాలే శ్రీను, ధార్మసోత్ రాము, శాసనాల రామయ్య, శివకుమార్ ఖండేల్ వాల్, పుణ్య నాయక్ తదితరులు పాల్గొని సభ విజయవంతానికి తామంతా కృషి చేస్తామని ప్రకటించారు.

# రైతుల రక్తం తాగుతున్న రాబందుల రాజ్యం

❑ **మెచ్చా నాగేశ్వరరావు**

అశ్వారావుపేట మే 3 (జన సంఘర్షణ)
అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ఆదివారం చంద్రుగొండ మండలం దామరచర్ల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, ధాన్యం కొనుగోలులో జరుగుతున్న జాప్యంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. క్షేత్రస్థాయిలో పేరుకుపోయిన ధాన్యపు రాశులను చూసి ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన, రైతుల గోడును అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పాలనలో అన్నదాతలు నడిరోడ్డుపై అల్లాడుతున్నారని, ఇది రైతు పక్షపాతి ప్రభుత్వం కాదు, దళారుల తొత్తు అని తీవ్రంగా విమర్శించారు. కేసీఆర్ హయాంలో ధాన్యం గింజ కూడా బయట పడకుండా కొనుగోలు చేసిన రోజులను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. నేడు రైతుల కష్టం రాబందుల పాలవుతుంటే ప్రభుత్వానికి కళ్ళు



కనబడటం లేదా అని ఘాటుగా ప్రశ్నించారు. రైతుబంధును ఎగ్గొట్టి, రైతుబీమాను పాతాళానికి తొక్కి, ఇప్పుడు పండించిన పంటను కూడా కొనకుండా రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి మాయ మాటలకు బలైపోయి రైతులు నేడు కన్నీరు పెడుతున్నారని దుయ్యబట్టారు. రైతులకు న్యాయం చేయడం చేతకాకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే గద్దె దిగాలని మెచ్చా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మళ్ళీ కేసీఆర్‌కి అధికారం అప్పగిస్తే నెల రోజుల్లోనే ఈ గందరగోళాన్ని చక్కదిద్ది రాష్ట్రాన్ని సుభిక్షం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. రైతులు ఆకలితో అలమటిస్తుంటే ప్రభుత్వం దళారులకు కొమ్ముకాయడం సిగ్గుచేటని, తక్షణమే కొనుగోలు ప్రక్రియ మొదలుపెట్టకపోతే బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి యుద్ధం ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వెంకట రెడ్డి, మండల బీఆర్ఎస్ నాయకులు దారా బాబు, సర్పంచ్లు ఇర్వ స్రవంతి, కొండెం కృష్ణవేణి, ప్రవీణ్ ప్రకాష్, ఉప సర్పంచ్ బాలు నాయక్, శ్రవణ్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రైతుల కన్నీటి శాపం ఈ ప్రభుత్వానికి తగులుతుందని, ప్రభుత్వం దిగివచ్చే వరకు తమ పోరాటం ఆగదని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.

# హిందూ ఐక్యతే లక్ష్యం: ఇల్లందులో భారీ ‘హిందూ సమ్మేళనం’

ఇల్లందు మే 03 (జన సంఘర్షణ)
మారుతున్న కాలమాన పరిస్థితుల్లో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవడానికి, ధర్మ పరిరక్షణ కోసం హిందూ సమాజం ఏకతాటిపైకి రావాల్సిన ఆవశ్యకతను చాటిచెబుతూ ఇల్లందు వేదికగా భారీ ‘హిందూ సమ్మేళనం’ నిర్వహణకు సర్వం సిద్ధమైంది. దేశానికి ఆత్మ వంటి హిందూ ధర్మాన్ని, సంస్కృతిని కాపాడుకుంటూ భరత మాత సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే నినాదంతో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. “గడప లోపల కులం – గడప దాటితే హిందువులం” అనే భావజాలంతో హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి, దేశాన్ని తిరిగి విశ్వగురువుగా నిలపాలనే ఉన్నత ఆశయంతో ఈ మేధో మథన సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ నెల 5వ తేదీ (మంగళవారం) సాయంత్రం 5 గంటలకు స్థానిక జే.కే సింగరేణి మైదానంలో జరిగే ఈ చారిత్రాత్మక సమ్మేళనానికి అంతర్జాతీయ రామ్ నామ్ ధరి అఘోర మండలేశ్వర శివనాగస్వామి జీ విశిష్ట అతిథిగా విచ్చేయనున్నారు. పులిగండ్ల మాధవరావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో సద్గురు ఆశ్రమం వ్యవస్థాపకులు ప్రబోధానంద డాక్టర్ జి. వీరభద్రం గురూజీ




ఆశీర్వచనాలు అందించనుండగా, ముఖ్య వక్తగా ఆర్.ఎస్.ఎస్ విభాగ్ సహ సంఘచాలక్ ఫణిభట్ల రాజేశ్వర శాస్త్రి పాల్గొని దిశా నిర్దేశం చేయనున్నారు. ధర్మం వైపు అడుగులు వేస్తూ, సామాజిక ఐక్యతను చాటిచెప్పే ఈ మహత్తర కార్యానికి కుటుంబ సమేతంగా తరలిరావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# లారీలు రాక తడిచిన మొక్కజొన్నలు






❑ **కొమరారంలో రైతుల ఆందోళన**

ఇల్లందు మే 03 (జన సంఘర్షణ)
ఇల్లందు మండలం కొమరారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రం వద్ద లారీలు రాకపోవడంతో వేలాది బస్తాలు నిలిచిపోయి, అకాల వర్షానికి తడిసిపోవడాన్ని నిరసిస్తూ ఆదివారం ఏఐకేఎంఎస్- న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో రైతులు భారీ ఆందోళన చేపట్టారు. 45 రోజుల క్రితమే కొనుగోళ్లు ప్రారంభమైనా, నేటికీ ఒక్క లారీ కూడా లోడింగ్ కోసం రాకపోవడంతో సుమారు 80 వేల బస్తాలు కేంద్రం వద్దే పేరుకుపోయాయని రైతు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం తరలింపులో జాప్యం కారణంగా రైతులు రాత్రింబవళ్లు అక్కడే పడిగాపులు కాస్తున్నారని మండల కార్యదర్శి మూడు మాలు, నాయకులు మోతిలాల్, జోగా కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం కారణంగా తడిసి ముద్దైన మొక్కజొన్నను ప్రభుత్వం ఎటువంటి కొర్రీలు లేకుండా తక్షణమే కొనుగోలు చేయాలని, వెంటనే లారీలను పంపి లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి తడిచిన ధాన్యాన్ని సేకరించకపోతే అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో నిరసనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బావుసింగ్, హరి, వీరేష్, వీరన్న, లక్ష్మ, రమేష్‌తో పాటు పలువురు రైతులు పాల్గొని తమ నిరసన తెలియజేశారు.

# భద్రాద్రిలో ఘనంగా ఏఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవం

కొత్తగూడెం మే 3 (జన సంఘర్షణ)
అఖిల భారత యువజన సమాఖ్య 67వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఆదివారం జిల్లా సమితి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎస్.కె. ఫహీమ్ దాదా ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. యువజన హక్కుల పోరాటంలో ఏఐవైఎఫ్ ఎల్లప్పుడూ ముందుంటుందని, నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# దివంగత డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ఇల్లందు డిపో ఉద్యోగుల భరోసా

ఇల్లందు మే 03 (జన సంఘర్షణ)



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సమ్మె కాలంలో ప్రాణాలు కోల్పోయిన నర్సంపేట డిపో డ్రైవర్ కోలా శంకర్ గౌడ్ కుటుంబాన్ని ఇల్లందు డిపో ఉద్యోగులు ఆదివారం పరామర్శించారు. నర్సంపేటలోని వారి నివాసానికి వెళ్లిన ఉద్యోగ బృందం, శంకర్ గౌడ్ చిత్రపటానికి నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఇల్లందు డిపో ఉద్యోగులు తమ ఉదారతను చాటుకుంటూ సేకరించిన రూ. 26,000 నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డిపో ఇంచార్జ్ సునీత, సిస్టమ్ సూపర్ వైజర్ వేమూరి నాగరాజు, డ్రైవర్ ఇమ్మడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని, తోటి కార్మికుని కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల నిధుల గోల్మాల్: టీయూసీఐ ఆగ్రహం

ఇల్లందు మే 03 (జన సంఘర్షణ)
సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఇల్లందులో ప్రగతిశీల కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) ముఖ్యుల సమావేశం నిర్వహించింది. బ్రాంచ్ అధ్యక్షుడు భూక్య రాజేష్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో కార్యదర్శి కొత్తపల్లి రఘు మాట్లాడుతూ.. కార్మికుల వేతనం నుండి కట్ చేస్తున్న సీఎంపీఎఫ్ నిధులు వారి ఖాతాల్లో జమ కావడం లేదని మండిపడ్డారు. దీనివల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, యాజమాన్యం నిర్లక్ష్యం వీడి పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.



# 19వ డివిజన్ బస్తీవాసుల నీటి కష్టాలకు చెక్: కార్పొరేటర్ చొరవ

కొత్తగూడెం మే 03 (జన సంఘర్షణ)
19వ డివిజన్ పరిధిలోని నేతాజీ బస్తీ, వనం దాస్ గడ్డ ప్రజల తాగునీటి సమస్యకు ఆదివారం కార్పొరేటర్ డాక్టర్ కేతావత్ స్వప్న నాయక్ శాశ్వత పరిష్కారం చూపారు. గత నెల ఏప్రిల్ 12న బస్తీ పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు, మున్సిపల్ అధికారులతో కలిసి నేతాజీ స్కూల్ సమీపంలో బోర్ పాయింట్‌ను గుర్తించి పవర్ బోర్ మంజూరు చేయించారు. సుమారు 200 అడుగుల్లోనే నీళ్లు పడటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బడ్జెట్ సమావేశంలో తన డివిజన్‌కు 4 బోర్లు కావాలని తీర్మానం చేశానని, మిగతావి కూడా త్వరలోనే మంజూరు చేయిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కల్లూరి కుమార్, సమ్మయ్య, రాజ్ కుమార్, శ్రీనివాస్ నాయక్, బోడ హరి తదితరులు పాల్గొన్నారు.



# ప్రగతి ప్రీమియర్ లీగ్-2 ప్రారంభం: క్రీడాస్ఫూర్తిని చాటాలి

కొత్తగూడెం మే 03 (జన సంఘర్షణ)
కొత్తగూడెం పట్టణంలోని ప్రగతి మైదానంలో ఆదివారం ప్రగతి ప్రీమియర్ లీగ్-2 క్రికెట్ టోర్నమెంట్‌ను సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ఘనంగా ప్రారంభించారు. యువత క్రీడలు, సాంస్కృతిక రంగాలపై దృష్టి సారించి తమ ప్రతిభను నిరూపించుకోవాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. క్రమశిక్షణ, పట్టుదలతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమవుతుందని యువతకు దిశానిర్దేశం చేశారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ స్నేహపూర్వక వాతావరణంలో క్రీడాస్ఫూర్తిని చాటాలని సాబీర్ పాషా సూచించారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా క్రీడాకారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 50వ డివిజన్ కార్పొరేటర్ దాసరి శ్రీనివాస్, నిర్వాహక కమిటీ సభ్యులు స్టాలిన్, జేమ్స్, అజయ్, చక్రధర్, బిట్టు, సాయి, భరత్ తదితరులు పాల్గొన్నారు.



జన సంఘర్షణ
సోమవారం
04 మే 2026

# మూడు దశాబ్దాల కన్నీటి వారధి

❑ ఇల్లందు ఎన్జీఓఎస్ కాలనీ వాసుల వంతెన కష్టాలు నిరీక్షణకు ముగింపు ఏది?

ఇల్లందు మే 03 (జన సంఘర్షణ)

ఇల్లందు పట్టణంలోని 3వ వార్డు ఎన్జీఓఎస్ కాలనీ వాసులకు అభివృద్ధి అంటే కేవలం కాగితాలకే పరిమితమైంది. గత 30 ఏళ్లుగా ఒక చిన్న వంతెన (బ్రిడ్జి) లేక ఆ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. దశాబ్దాలు గడుస్తున్నా, పాలకులు మారుతున్నా వీరి రవాణా కష్టాలు మాత్రం అస్సలు తీరడం లేదు. కాలనీని పట్టణంతో కలిపే ప్రధాన మార్గంలో వాగు అడ్డంగా ఉండటంతో, ప్రతిరోజూ వందలాది మంది ప్రాణాలకు తెగించి రాకపోకలు సాగిస్తున్నారు.



**శంకుస్థాపనలకే పరిమితమైన పనులు**

ప్రజల నిరసనలు, వినతుల నేపథ్యంలో గతంలో సుమారు రూ. 60 లక్షల వ్యయంతో వంతెన నిర్మాణానికి పాలకులు శంకుస్థాపన అయితే చేశారు. శిలాఫలకం వేయగానే తమ కష్టాలు తీరుతాయని ఆశించిన కాలనీ వాసులకు నిరాశే ఎదురైంది. శంకుస్థాపన జరిగి నెలలు గడుస్తున్నా, నేటికీ అక్కడ ఒక్క ఇటుక కూడా పడలేదు. నిధులు మంజూరయ్యాయని చెబుతున్నా, పనులు ఎందుకు ప్రారంభం కావడం లేదనే ప్రశ్న స్థానికుల్లో ఆగ్రహాన్ని కలిగిస్తోంది.

**చినుకు పడితే బందీలే..**

వర్షాకాలం వచ్చిందంటే చాలు ఎన్జీఓఎస్ కాలనీ వాసుల గుండెల్లో వణుకు మొదలవుతుంది. స్వల్ప వర్షానికే వాగు ఉప్పొంగి దారి పూర్తిగా మూసుకుపోతోంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లాల్సిన వృద్ధులు, గర్భిణీలు నీటి ప్రవాహంలో చిక్కుకుపోతున్నారు. మోకాళ్ల లోతు నీటిలో ప్రయాణం చేయలేక, కాలనీ బయటకు రాలేక గృహ నిర్బంధంలో ఉన్నట్లుగా గడపాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం - ప్రజల ఆగ్రహం**

వంతెన సమస్యపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. అధికారులు కేవలం సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారని, ప్రజా సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని కాలనీ వాసులు మండిపడుతున్నారు. 30 ఏళ్లుగా ఒక చిన్న బ్రిడ్జిని నిర్మించలేకపోవడం వ్యవస్థల వైఫల్యానికి నిదర్శనమని వారు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో ఉన్న తీవ్రతను గుర్తించాల్సిన అవసరం ఉంది.

**ఎమ్మెల్యే స్పందిస్తారా?**

ఇల్లందు ఎమ్మెల్యే ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, తక్షణమే పెండింగ్‌లో ఉన్న వంతెన పనులను ప్రారంభించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కేవలం హామీలతో సరిపెట్టకుండా, యుద్ధ ప్రాతిపదికన నిధులు విడుదల చేయించి పనులు పూర్తి చేయాలని వారు కోరుతున్నారు. వర్షాకాలం పూర్తిస్థాయిలో రాకముందే బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోతే, రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ఎన్జీఓఎస్ కాలనీ ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# భూమి పరిరక్షణ: మనందరి బాధ్యత

ఇల్లందు మే 03 (జన సంఘర్షణ)

ధరిత్రి దినోత్సవ, "ఎర్త్ మంత్" పురస్కరించుకుని ఇల్లందులోని గాయత్రీ పరివార్ యజ్ఞశాలలో ఒక గొప్ప కార్యక్రమం జరిగింది. ఈ వేదికపై స్వచ్ఛ భారత్ బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ సతీష్ ఖండేల్వాల్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి, పర్యావరణ ప్రేమికుడు 'గ్రీన్ వారియర్' జే వి ఎస్ చంద్రశేఖర్ రూపొందించిన 'భూమి పరిరక్షణ ప్రతిజ్ఞ పత్రాన్ని' సతీష్ ఖండేల్వాల్ గారు అధికారికంగా విడుదల చేశారు. ఈ పత్రం పర్యావరణ పరిరక్షణ పట్ల సమాజంలో అవగాహన పెంచే దిశగా ఒక కీలక అడుగుగా నిలిచింది. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ ఖండేల్వాల్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో పెరిగిపోతున్న గ్లోబల్ వార్మింగ్ పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యం, మారిన మానవ జీవనశైలి కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని, ఇది నేరుగా మానవ మనుగడపై ప్రతికూల ప్రభావం చూపుతోందని ఆయన హెచ్చరించారు. భూమిని కాపాడుకోవడం అంటే కేవలం మొక్కలు నాటడం మాత్రమే కాదని, మన దైనందిన జీవితంలో చేసే చిన్న చిన్న మార్పులు కూడా పెద్ద ఫలితాలను ఇస్తాయని ఆయన స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డాక్టర్ సతీష్ ఖండేల్వాల్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సమాజంలో ప్రతి వ్యక్తి తనవంతు బాధ్యతగా ప్రకృతిని గౌరవించాలని, భావితరాలకు సురక్షితమైన భూమిని అందించడం మనందరి ప్రాథమిక కర్తవ్యమని ఆయన ఉద్ఘాటించారు. స్వచ్ఛ భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో పర్యావరణ పరిరక్షణ ఒక అంతర్భాగమని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పచ్చదనాన్ని పెంచడం ఎంతో అవసరమని ఆయన వివరించారు. డాక్టర్ సతీష్ ఖండేల్వాల్ నాయకత్వంలో విడుదలైన ఈ ప్రతిజ్ఞ పత్రం ప్రజల్లో చైతన్యం నింపుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. చంద్రశేఖర్ వంటి వ్యక్తులు అందిస్తున్న గ్రీన్ వారియర్ సేవలను సతీష్ ఖండేల్వాల్ అభినందించారు. ఇలాంటి సామాజిక కార్యకర్తల కృషికి ప్రజల మద్దతు తోడైతేనే పర్యావరణ మార్పు సాధ్యమవుతుందని, ఇల్లందు లాంటి ప్రాంతాల నుండి ఇటువంటి గొప్ప సంకల్పం రావడం సంతోషకరమని ఆయన కొనియాడారు.




## రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్‌కు పాల్వంచ చిన్నారి

❑ 'హర్షిక' ఎంపిక వెల్లువెత్తుతున్న ప్రశంసలు!



పాల్వంచ మే 03 (జన సంఘర్షణ)

క్రీడలు కేవలం శారీరక దారుఢ్యానికే కాదు, ఒక ప్రాంతం యొక్క ఆత్మగౌరవానికి ప్రతీకలని నిరూపిస్తోంది పాల్వంచకు చెందిన గుండెబోయిన హర్షిక. 36వ డివిజన్ నుండి రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన ఈ చిన్నారి విజయం, కేవలం ఒక వ్యక్తిగత గెలుపు మాత్రమే కాదు, వనరులు తక్కువగా ఉన్నా పట్టుదల ఉంటే ఆకాశమే హద్దు అని చాటిచెప్పే ఒక స్ఫూర్తిదాయక ప్రయాణం. నేటి డిజిటల్ యుగంలో పిల్లలు సెల్ ఫోన్లకే పరిమితమవుతున్న తరుణంలో, హర్షిక వంటి క్రీడాకారిణులు రింగులో చూపిస్తున్న తెగువ సమాజానికి ఒక బలమైన సందేశాన్ని ఇస్తోంది. కోచ్ సూరిబాబు శిక్షణ, తల్లిదండ్రుల నిరంతర ప్రోత్సాహం వెన్నంటి ఉంటే, మారుమూల ప్రాంతాల నుండి కూడా అంతర్జాతీయ స్థాయి ఆణిముత్యాలు ఉద్భవిస్తాయని ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది. కార్పొరేటర్ పైడిపల్లి జయలక్ష్మి మనోహర్ రావు పేర్కొన్నట్లుగా, ప్రభుత్వాలు క్రీడా మౌలిక సదుపాయాలపై దృష్టి సారిస్తే, హర్షిక లాంటి ప్రతిభావంతులు రేపు ఒలింపిక్ వేదికలపై భారత్ గర్వించేలా చేస్తారనడంలో సందేహం లేదు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్న ఈ "గోల్డెన్ గర్ల్" ప్రయాణం, రేపటి తరం యువతకు ఒక దిశానిర్దేశం.

## కొమరారం కొనుగోలు కేంద్రంలో తడిసిన మొక్కజొన్న

❑ లారీలు లేక రైతుల ఇబ్బందులు

ఇల్లెందు ప్రతినిధి( జన సంఘర్షణ)




ఇల్లందు మండలం కొమరారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో వేలాది బస్తాల మొక్కజొన్న అకాల వర్షాలకు తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లారీలు అందుబాటులో లేకపోవడంతో కొనుగోలు చేసిన ధాన్యం ఇంకా కేంద్రం వద్దే నిల్వ ఉండిపోతోంది. ఈ సమస్యపై న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) ఇల్లందు మండల కార్యదర్శి మూడు మాలు, న్యూడెమోక్రసీ నాయకులు వాంకుడోతు మోతిలాల్, జోగా కృష్ణ మాట్లాడుతూ, సుమారు 45 రోజుల క్రితం కొనుగోలు ప్రారంభమైనప్పటికీ ఇప్పటివరకు ఒక్క లారీ కూడా లోడింగ్ జరగలేదని తెలిపారు. సుమారు 80 వేల బస్తాల మొక్కజొన్న కేంద్రం వద్దనే నిల్వ ఉండిపోయిందని, రైతులు తమ ధాన్యం వద్దే కాపలా కాస్తూ రోజులు గడుపుతున్నారని తెలిపారు. అకాల వర్షానికి తడిసిన మొక్కజొన్నను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి, లారీలు ఏర్పాటు చేసి త్వరగా తరలించాలని డిమాండ్ చేశారు. లేకపోతే అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) ఆధ్వర్యంలో ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు బావుసింగ్, హరి, వీరేష్, వీరన్న, లింగ, హార్జ్య, కృష్ణ, సక్రం, సత్యం, కీర్య, హర్యా, బద్రు, వెంకటేష్, నరేష్, నగేష్, ఈరు, శంకర్, సోమ్లా, లక్క్మ, మంగీలాల్, మంగ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


## ముధోల్‌లో నేడు రైతు వారోత్సవం కార్యక్రమం

ముధోల్, మే 3 (జన సంఘర్షణ)

ముధోల్ మండల రైతులకు వ్యవసాయ శాఖ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, మే 4, 2026 సోమవారం రోజున "రైతు వారోత్సవం కార్యక్రమం" నిర్వహించనున్నట్లు వ్యవసాయ మండల అధికారి తెలిపారు. ఈ కార్యక్రమం ముధోల్ రైతు వేదిక కార్యాలయంలో ఉదయం 8:30 గంటలకు ప్రారంభం కానుంది. రైతులకు వ్యవసాయ రంగంలో ఉపయోగపడే పలు ముఖ్యమైన అంశాలపై శాస్త్రీయ పద్ధతుల్లో అవగాహన కల్పించనున్నారు. ముఖ్యంగా నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం, నాణ్యమైన విత్తనాల వినియోగం, పంట రుణాలు, వ్యవసాయ యాంత్రీకరణ వంటి అంశాలపై అధికారులు, నిపుణులు రైతులకు సూచనలు ఇవ్వనున్నారు. కావున మండలంలోని రైతులు పెద్ద సంఖ్యలో హాజరై వ్యవసాయ శాఖ అందించే సలహాలు, సూచనలు తెలుసుకొని మెరుగైన దిగుబడులు సాధించాలని వ్యవసాయ మండల అధికారి కోరారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బట్టల దుకాణం దగ్ధం

ఎల్లారెడ్డి, మే -3(జన సంఘర్షణ )



షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ బట్టల దుకాణం పూర్తిగా దగ్ధమైన ఘటన ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడు దేవేందర్ తెలిపిన వివరాల మేరకు.. ఎల్లారెడ్డిలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న కనెక్ట్ మెన్స్ అండ్ కిడ్స్ వేర్ బట్టల దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రూ.40 లక్షల ఆస్తి నష్టం జరిగిందని దుకాణం యజమాని దేవేందర్ పేర్కొన్నారు. కాగా నాగం దేవేందర్‌కు చెందిన బట్టల దుకాణం కార్మికుడు వచ్చి షాప్ తాళం తీయగా అందులో వ్యాపించిన మంటలను గమనించి యజమానికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారులు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. భారీగా ఆస్తి నష్టం జరిగిన కారణంగా తనను ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

## గంధంపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం - యువకుడు మృతి

ఇల్లెందు ప్రతినిధి (జన సంఘర్షణ)



బయ్యారం మండలంలోని గంధంపల్లి సమీపంలో ఆదివారం సాయంత్రం విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సంతులాల్ బోర్డు తండా గ్రామానికి చెందిన సాగర్ అనే యువకుడు గంధంపల్లి వైపు వస్తుండగా, ఇల్లెందు నుండి అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాగర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం.. కారు వేగం అధికంగా ఉండటంతో నియంత్రణ కోల్పోయి యువకుడిని బలంగా ఢీకొట్టి, ఆపకుండా ఘటన స్థలం నుండి పరారైంది. సమాచారం అందుకున్న వెంటనే బయ్యారం పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. పోలీసులు కేసు నమోదు చేసి, ఘటనకు కారణమైన కారును గుర్తించేందుకు సమీప ప్రాంతాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

## అకాల వర్షంతో తడిసిన మొక్కజొన్న - భారీ నష్టంలో రైతులు

ఇల్లెందు ప్రతినిధి (జన సంఘర్షణ)



ఇల్లందు మండలం రేపల్లెవాడ (చలసముద్రం) మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో అకాల వర్షం కారణంగా రైతులు భారీ నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రం వద్ద నిల్వ ఉంచిన మొక్కజొన్న బస్తాలు పూర్తిగా తడిసిపోవడంతో నాణ్యత దెబ్బతిని, రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సరైన గిడ్డంగులు, షెడ్లు, తార్పులు అందుబాటులో లేకపోవడంతో వందలాది క్వింటాళ్ల మొక్కజొన్న వర్షానికి గురై నష్టం వాటిల్లింది. దీనివల్ల రైతులకు లక్షల్లో ఆర్థిక నష్టం కలిగే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే అప్పుల్లో ఉన్న రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని జిల్లా కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించి, తక్షణమే రైతులను ఆదుకునే చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. తడిసిన మొక్కజొన్నను ప్రభుత్వం కొనుగోలు చేసి, రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. రైతులను ఆదుకుందాం.. మొక్కజొన్న సమస్యను పరిష్కరిద్దాం..మన ఐక్యతే రైతు బలం..

## ఒక కన్నును నేను కోల్పోయాను నా భార్య ఒక కిడ్నీ కోల్పోయింది

❑ ఉన్న ఇల్లు రోడ్డు వెడల్పులో భాగంగా చాలా వరకు పోతుంది
❑ ఉన్న ఇల్లు శిథిలావస్థకు చేరింది ఎప్పుడు కూలుతుందో తెలియదు
❑ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తారని ఆశతో

రుద్రూర్/మే 3/(జన సంఘర్షణ)



ఒక కన్నును నేను కోల్పోయాను. ప్రస్తుతం ఒక కన్ను లేక అలాగే ఉంటున్నాను. నా భార్య ఒక కిడ్నీ కోల్పోయింది, ఉన్న ఇల్లు రోడ్డు వెడల్పుల భాగంగా పోతుంది. ఉన్న మరికొంత ఇల్లు శిథిలావస్థకు చేరింది, ఎప్పుడు కూలుతుందో తెలియదు, ఇందిరమ్మ ఇల్లు ఇస్తారని ఆశతో ఎదురు చూస్తున్నాం, కాంగ్రెస్ పార్టీలో ఒక కార్యకర్తగా సుమారు 30 సంవత్సరాలు పని చేసి ఉన్నాను, నాకు న్యాయం చేయండి అంటూ.. గైని లింగం తన గోడును విన్నవించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరాధారంగా ఉన్న తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడమే కాకుండా, కిడ్నీ కోల్పోయిన నా భార్యకు నాకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని తెలిపారు.

## ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఫొటో బహుకరిస్తున్న ఏఎంసీ చైర్మన్

ఎల్లారెడ్డి, మే 3 (జన సంఘర్షణ )



ఎల్లారెడ్డి మండలం భిక్కనూర్ గ్రామంలో శ్రీనివాస్ రెడ్డి ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మా రెడ్డి రజిత హాజరయ్యారు. అనంతరం ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు గుర్తుగా రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ ఫొటోలను బహుకరించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.... స్వంత గ్రామంలో ఇల్లు లేకపోవడంతో ఉపాధి నిమిత్తం హైదరాబాద్ వెళ్లిన మాకు స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి సొంతింటి కళ నెరవేర్చారన్నారు. గృహ ప్రవేశ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భిక్కనూర్ గ్రామ సర్పంచ్ సాయిలు, కాంగ్రెస్ నాయకులు కురుమ సాయి బాబా, మా రెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సివి అభిమానుల ఆధ్వర్యంలో జననేత కు జన్మదిన వేడుకలు

- **పలు చోట్ల సామాజిక సేవా కార్యక్రమాలు**

శ్రీకాళహస్తి మే 03 (జన సంఘర్షణ):



శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు ఎస్ సి వి నాయుడు 71వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, వెంకటగిరి, తిరుపతి తో పాటు పలు నియోజకవర్గాల నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎస్ సి వి అభిమానులు విచ్చేసి ఎస్ సి వి నాయుడు కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ సి వి నాయుడు స్వగృహంలో నాయకులు అభిమానులు ఏర్పాటు చేసిన జన్మదిన కేకులను ఎస్ సి వి నాయుడు కట్ చేసి నాయకులు కార్యకర్తలకు పంపిణీ చేశారు. పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు విచ్చేసి ఎస్‌సివి నాయుడును గజ పూలమాలలతో, శాలువలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.పలువురు నాయకులు పూల కిరీటాలు, ప్రత్యేకంగా తయారు చేసిన మాలలతో ఎస్‌సివి నాయుడు ను సత్కరించారు. స్థానిక అర్చకులు, వివిధ మత పెద్దలు విచ్చేసి ఎస్‌సివి నాయుడును ఆశీర్వదించారు. ప్రజానాట్యమండలి కళాకారిణి ఎస్ సి వి సేవా గుణాన్ని చాటేలా జానపద గీతాన్ని ఆలపించి అలరించారు. నాయకులు, అభిమానులతో ఎస్సీవీ నాయుడు గృహం జన సందడిగా మారింది. ఎస్‌సివి జన్మదినాన్ని పురస్కరించుకొని ఎస్సీవీ యూత్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక ఏరియా హాస్పిటల్‌లో రోగులకు బ్రెడ్డు పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని ఎస్సివి శ్రీకాంత్ ప్రారంభించి పంపిణీ చేశారు. స్థానిక పెళ్లి మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఎస్‌సివి శ్రీకాంత్, టిడిపి నాయకులు ప్రవీణ్, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ప్రారంభించి పేదలకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. పలుచోట్ల మజ్జిగ, పండ్ల రసాలు పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. తమ అభిమాన నాయకుడు ఎస్సీవి నాయుడు జన్మదిన వేడుకలను ఎస్ సివి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలా ఎస్‌సివి అభిమానులు తదితరులు నాయకులు పాల్గొని, శుభాకాంక్షలు తెలియజేశారు.

## సాంప్రదాయపద్ధంగా విజయ వినాయక స్వామి నవగ్రహ దేవతల ప్రాణ ప్రతిష్ట

చౌడేపల్లి మే 03 (జన సంఘర్షణ):



విజయ వినాయక స్వామి నవగ్రహ దేవతలు నాగదేవతలు విమాన గోపుర కలశ ప్రతిష్ట కుంబాభిషేక మహోత్సవాలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు . విజయవాణి విద్యాసంస్థల ఆధ్వర్యంలో విజయ వాణి నగర్ నందు ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. మూడు రోజులపాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు తొలి రోజున గోపూజ ఆలయ ప్రవేశము గణపతి పూజతో ప్రారంభమై రెండవ రోజున కలశాచ్చన, అంగహోమము, జలాధివాసము వంటి కార్యక్రమాలు వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మూడవ రోజున ప్రాణ ప్రతిష్ట ప్రధాన హోమాలు, నాడీ సంధానము, కలామ్యాప హోమము, అష్టపల్లి ప్రధాన పూర్ణాహుతి, కుంబాభిషేకము, పంచామృతాభిషేకము, రుద్రాభిషేకము, విశేష ష్ర్తఅలంకరణ, మహా మంగళహారతి , అష్టావధాన సేవ తీర్థ ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు హోమాది కార్యక్రమాలలో విజయవాణి విద్యాసంస్థల అధినేతలు నాయుని చంద్రకళ నాయుని చంద్రశేఖర్ మూర్తి నాయని విజయనిర్మల నాయుని సుధాకరమూర్తి నాయుని జయమ్మ నాయుని పద్మ కుమారి నాయుని మహేష్ బాబు నాయుని కరుణ నాయన వారి కుటుంబ సభ్యులు పాల్గొనగా విజయవాణి సంస్థల సిబ్బంది చౌడేపల్లి మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లకు విశేష పూజలు ముక్కులు చెల్లించుకున్నారు ముఖ్యంగా తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు వారిచే హరికథ కచేరి వంటి కార్యక్రమాలు నిర్వహించారు, ప్రతిరోజు అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో విజయ వినాయక స్వామి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వరల్డ్ రికార్డ్ ఈవెంట్‌లో ఇల్లందు చిన్నారి రిషిత శ్రీ సందడి: ప్రశంసా పత్రం కైవసం

- **ప్రతిష్ఠాత్మక వేదికపై నృత్య ప్రదర్శన**

ఇల్లందు మే 03 (జన సంఘర్షణ)

మహబూబాబాద్‌లోని బాలాజీ గార్డెన్స్‌లో తాండవకృష్ణ మహిళా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక వరల్డ్ రికార్డ్ ఈవెంట్‌లో ఇల్లందుకు చెందిన చిన్నారి మేకల రిషిత శ్రీ పాల్గొంది. కళలకు కాణాచి అయిన ఈ వేదికపై తన అద్భుత నృత్య ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకుంది. ఈ అంతర్జాతీయ స్థాయి కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా తన ప్రతిభను చాటుకోవడమే కాకుండా, ఇల్లందు పట్టణ ఖ్యాతిని మరోస్థాయికి తీసుకెళ్లింది.

**అరుదైన ప్రశంసా పత్రం కైవసం**

ఈ వరల్డ్ రికార్డ్ ఈవెంట్‌లో రిషిత శ్రీ ప్రదర్శించిన నైపుణ్యానికి గుర్తింపుగా ఆమెకు గౌరవప్రదమైన 'ప్రశంసా పత్రం' అందజేశారు. ఒక ప్రపంచ స్థాయి రికార్డు ఈవెంట్‌లో పాల్గొని ఇలాంటి అరుదైన సర్టిఫికేట్ అందుకోవడం సాధారణ విషయం కాదు. తల్లిదండ్రులు మేకల మధు, కావ్యల ప్రోత్సాహంతో, చిన్న వయసులోనే ఇంతటి పెద్ద వేదికపై సత్తా చాటి ఈ ఘనతను సాధించింది.

**గ్రామీణ ప్రతిభకు నిదర్శనం**

మారుమూల ప్రాంతం నుండి వచ్చి ఒక వరల్డ్ రికార్డ్ కార్యక్రమంలో భాగస్వామి కావడం రిషిత శ్రీ పట్టుదలకు నిదర్శనం.




ఆమె అందుకున్న ఈ ప్రశంసా పత్రం కేవలం ఒక గుర్తింపు మాత్రమే కాదు, ఆమె కష్టానికి దక్కిన ప్రతిఫలం. నేటి తరం పిల్లలకు భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే నృత్య కళలో ఇలాంటి గుర్తింపు రావడం తోటి విద్యార్థులకు ఎంతో స్ఫూర్తినిస్తుంది.

## పెద్దగుట్టలో దోపిడీ ఎప్పుడు ఆగదు

వర్ని/మే3/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా వర్ని మండలం బడాపాడు పెద్దగుట్ట పుణ్యక్షేత్రంలో ఆదివారం నాడు భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారన్నదానికి ఈ చిత్రమే ఉదాహరణ అని పలువురు చెబుతున్నారు. ఆదివారం భక్తులు దైవదర్శనం కోసం వచ్చి మేకలను వదిలిపెట్టడానికి వస్తే సుమారు 7000 నుంచి 8,000 విలువ చేసే మేకలను ఏలాంటి రిసిప్ట్ ఇవ్వకుండా వారు అమ్ముకుంటున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. హుండీలో వేయవలసిన డబ్బులు సందల్ సమర్పించడానికి మొక్కుబడులు తీర్చుకోవడానికి సుమారు 2000 నుంచి 5000 రూపాయలు నిలువు దోపిడీ చేస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దగుట్టలో నిలువు దోపిడీ అనేది ఏళ్ల నుంచి ఆగడం లేదని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. నిలువు దోపిడీకి బ్రేక్ లేదని పలువురు ఆరోపణలు చేస్తున్నారు.

## స్మార్ట్ యూత్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

ఎల్లారెడ్డి, మే -3(జన సంఘర్షణ )



మండలంలోని సోమిర్యాగడ్ తండా స్మార్ట్ యూత్ అసోసియేషన్ నూతన కమిటీని తండా యువకులు, అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. ఈ కమిటీలో అధ్యక్షుడు అజ్మీర నగేష్, ఉపాధ్యక్షుడు పాత్లోత్ కిషోర్, ప్రధాన కార్యదర్శి ధనావాత్ లక్ష్మణ్, కోశాధికారి పాత్లోత్ జెల్ సింగ్, సలహాదారులుగా ధనావాత్ సర్ధర్, క్రీడా కార్యదర్శిలుగా అంగోత్ హరి, మాలోత్ రమేష్, అన్నశాంతి కార్యదర్శిలుగా దేవషోత్ రవి, బాణోత్ రమేష్, ఆడిట్ అధికార కార్యదర్శిగా దేవశోత్ రవీందర్ సీఆర్ఫిఫ్ గా ఎన్నుకోవడం జరిగిందని పేర్కొన్నారు.

## హకీమ్ వర్సెస్ కోనేరు శశాంక్

- **ప్రజా సేవలో ఇరువురు**
- **ఆర్థిక సహకారం అందించడంలో వారికి సాటి లేరు ఎవరు**
- **హకీమ్ టిఆర్ఎస్ అయితే కోనేరు శశాంక్ బిజెపి పార్టీ**
- **పార్టీలకు అతీతంగా కుల మతాలకు అతీతంగా వర్గ విభేదాలకు అతీతంగా ప్రజాసేవలో వారు**

కోటగిరి ఉమ్మడి మండల/మే 3/(జన సంఘర్షణ)

కష్టాల్లో ఉన్నవారికి ఆపదలో ఉన్నవారికి మేమున్నామంటూ భరోసా ఇస్తున్నారు హకీం భాయ్, కోనేరు శశాంక్. ఇరువురి లక్ష్యం ఒకటే ప్రజాసేవలో అహర్నిశలు నిమగ్నం అవుతున్నారు, ఆర్థిక సహకారంతో పాటు ఇతర సేవలు అందించడంలో వారికి సాటి లేరు ఎవరు అనే చర్చ బాగానే జరుగుతుంది. ప్రజలకు సేవలు చేయడమే ఒక జీవిత లక్ష్యంగా మార్చుకున్నారు. ఇరువురు అందుకే అనునిత్యం ప్రజల మధ్య ఉంటున్నారు, ఏ ఊర్లో ఎవరికి కష్టమొచ్చినా అక్కడ వాలుతున్నారు. ఎవరి శైలిలో వారు సహకారం అందిస్తూనే ఉన్నారు. అంతేకాకుండా హకీం భాయ్ టిఆర్ఎస్ పార్టీ నుంచి అయితే కోనేరు శశాంక్ బిజెపి పార్టీ నుంచి పార్టీల పరంగా కూడా సేవలు అందిస్తూనే ఉన్నారు. పార్టీలు ఏదైనా పార్టీలకతీతంగా ప్రజాసేవ చేయడంలో ముందు ఉండడం విశేషం అని ప్రజలు కొనియాడుతున్నారు. కోటగిరి పోతంగల్ మండల ప్రజలు అదృష్టవంతులే అని ప్రజలు చర్చలు చేసుకుంటున్నారు ఎందుకంటే అక్కడ హకీం భాయ్ కోనేరు శశాంక్ ఉన్నారు. కదా కష్టాల్లో ఉన్నవారికి ఆదుకోవడానికి అనే చర్చ జరుగుతుంది .అయితే పక్కనే ఉన్న రుద్రూర్ తో పాటు వర్నితో పాటు చందూరు మోసరాతో పాటు పలుచోట్ల ఇలాంటివారు





ఎందుకు లేకపోయారు అనే ప్రశ్నలు మాత్రం బాగానే వినిపిస్తున్నాయి.

## ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

- **పట్టించుకోని మున్సిపల్ అధికారులు.**
- **తీవ్రమైన దుర్గంధంతో ఇళ్లలో ఉండలేమంటూ స్థానికుల ఆవేదన.**

హైదరాబాద్, శేరిలింగంపల్లి మే 03 (జన సంఘర్షణ):

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ షంషీగూడ పరిధిలోని ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్ మజీద్ గల్లి లైన్ బ్లాక్ నెంబర్ 143 నివాస గృహాల మధ్య తీవ్రమైన దుర్గంధంతో ఇళ్లలో ముక్కుమూసుకొని ఉండాల్సిన దుస్థితి నెలకొందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. గత మూడు నెలలకు పైగా ఎల్లమ్మ బండ పరిసరాల్లో డ్రైనేజీ లీకేజీలు నిరంతరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే వార్డు, మున్సిపల్ కార్యాలయంలో ఒకటికి, రెండుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల నిర్లక్ష్యం, సిబ్బంది నిర్వాకం శాపంగా మారిందని ఆ డివిజన్ ప్రజలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. రోడ్లపై చెత్తంతా నెలల తరుబడి పేరుకపోవడంతో గాలి వీచిన సమయంలో తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోందని, అప్పుడు ఇళ్లలో శ్వాస తీసుకోలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. మురికి నీరు కాలనీలో రోడ్లపైనే పొంగి పొర్లుతూ ఉండటం వలన దోమలు, పందులు,స్వైర విహారం చేయడం వల్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ఈ దుర్గంధం కారణంగా చిన్నారులు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారని తీవ్రమైన ఆవేదన వ్యకం చేస్తున్నారు. చుట్టు పక్కల వారు సైతం రాత్రి వేళల్లో వచ్చి ఇక్కడి చెత్తను పడేసి వెళ్తున్నారని వాపోతున్నారు. ఈదురు గాలులకు చెత్తంతా ఇళ్లలోకి వస్తుండటం మరింత ఇబ్బందులకు గురి చేస్తుందని పేర్కొంటున్నారు. మున్సిపల్ సంబంధిత పారిశుధ్య విభాగం అధికారుల దృష్టికి తీసుకవెళ్లినా ప్రయోజనం ఉండటం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి,ఈ ప్రధాన సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇక్కడ సరైన డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థ లేకపోవడం, తరచుగా డ్రైనేజీ లీకేజీలు, పూడిక తీయకపోవడం



ప్రధాన సమస్యగా ఉంది. స్థానిక ప్రజలు జిహెచ్ఎంసి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించడం లేదని, వెంటనే డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.మున్సిపల్ అధికారలు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
సోమవారం
04 మే 2026

# చిత్తూరు ఎంపీకి నాకు ఎలాంటి విభేదాలు లేవు

- మా ప్రమేయం లేకుండానే ప్రాపగాండా జరిగింది.
- ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

చిత్తూరు మే3 (జన సంఘర్షణ)

డ్వాక్రా సంఘంలో ఆర్థిక లావాదేవీలు సంబంధించిన చిన్నపాటి తగాదా.. దాడిగా ప్రచారం జరిగిందని, ఇది ఒక దురదృష్టకర సంఘటన అని, మా ప్రమేయం లేకుండానే ప్రాపగండా అయిందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. ఆదివారం చిత్తూరులోని ఎమ్మెల్యే వారి కార్యాలయంలో తెదేపా మహిళా నాయకులు, ఆర్పీలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్థిక లావాదేవీల విషయంలో జరిగిన వివాదం.. మాకు అందిన సమాచారం, సమన్వయ లోపం కారణంగా మీడియాలో ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యే అన్న విధంగా ప్రచారం జరిగిందని.. కానీ వాస్తవంగా మా మధ్య ఎలాంటి వివాదాలు లేవని, ఎంపీ నాకు తండ్రి తో సమానం అని గడిచిన రెండేళ్లుగా తాము చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం కలిసికట్టుగా కృషి చేస్తున్నామని, ముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు యువ నాయకుడు లోకేష్ సారథ్యంలో ఇటు అధికారులను ఇటు నాయకులను సమన్వయం చేసుకొని ముందుకు సాగుతున్నామని చెప్పారు. రెండేళ్లలో ఎక్కడా అధికారులను మార్చడం గాని, వేరే రకంగా ఇబ్బంది పెట్టడం గాని చేయలేదని, నగరపాలక కార్యాలయంలో జరిగిన ఘటనలోనూ మాటల వివాదం కాస్త దాడిగా ప్రచారం జరిగిందన్నారు. సంఘటన జరిగిన అనంతరం అటు మహిళా నేతలను, ఆర్పీలతోనూ మాట్లాడడం జరిగిందని, వివాదాలకు ముగింపు పలికి.. కలిసిమెలిసి పనిచేస్తామని వారు చెప్పారన్నారు. ముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు యువ నాయకుడు నారా లోకేష్ సారథ్యంలో.. చిత్తూరులో గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని.. గత కొన్ని దశాబ్దాలుగా జరగని రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులు ప్రస్తుతం జరుగుతున్నాయని వివరించారు. అందరూ పని చేసేది ప్రజల కోసమేనని.. అందర్నీ కలుపుకొని.. ముందుకు



వెళ్తున్నట్లు చెప్పారు. వివాదాలకు తావు లేకుండా పనిచేయడమే తన ముఖ్య ఉద్దేశం అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనుకోకుండా జరిగిన ఈ వివాదానికి ఇంతటితో ముగింపు పలుకి... అందరూ కలిసికట్టుగా ముందుకు సాగుదామని చెప్పారు. కార్యక్రమంలో తెలుగుదేశం మహిళా నాయకులు, ఆర్పీల సంఘం నాయకులు, ఆర్పీలు పాల్గొన్నారు.

# పోతంగల్ ఇసుక మాఫియా ఆపాలి

పొతంగల్/మే 3/ (జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా పొతంగల్ మండల మంజీరా సరిహద్దు ప్రాంతం, కోడిచర్ల, హంగర్గా మంజీరా సరిహద్దు ప్రాంతంలో ప్రతిరోజు ప్రభుత్వ అనుమతుల పేరుతో టిఎండిసి ఆధ్వర్యంలో జరుగుతున్న ఇసుక త్రవ్వకాలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని ఈ ఇసుక మాఫియా ఆపకపోతే భావితరాల వారికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని భూసారం నిస్సారవంతంగా మారి భూగర్భ జలాలు అడుగంటిపోయి రైతులకు పంట పొలాల్లో ఉన్న బోర్లు నీరు రాక ఇబ్బంది పడే పరిస్థితులు ఉంటాయని చివరికి ఆ గ్రామ ప్రజలకు చుట్టుపక్క ఉన్న గ్రామ ప్రజలకు తాగునీరు అందని పరిస్థితి ఏర్పడుతుందని బిజెపి పార్టీ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్ సీనియర్ బిజెపి పార్టీ బాన్సువాడ నాయకులు పబ్బా శేఖర్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీఎండీసీ ఆధ్వర్యంలో పట్టా భూముల పేరుతో అక్రమంగా ఇసుక త్రవ్వకాలు చేయడమే కాకుండా నిబంధనకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా జరుపుతూ విక్రయాలు చేస్తూ సంబంధిత శాఖ కాంట్రాక్టర్లు కొంతమంది కోట్లు గడిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా భూగర్భజలాలు అడుగంటి పోయే విధంగా చేస్తూ వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారని రాబోయే రోజుల్లో మంజీరా నదులు ఎడారిగా మారి రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని ఇంత పెద్ద ఎత్తున ఇసుక మాఫియా జరుగుతుంటే బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మౌనంగా ఎందుకు ఉన్నారని అన్నారు. పోతంగల్ మండల కేంద్రంలోని పొతంగల్ శివారు అదేవిధంగా కొడిచెర్ల శివారుతోపాటు కారేగాం శివారు హంగర్ గా శివారు, ప్రాంతంలో టిఎండిసి ఆధ్వర్యంలో అనుమతుల పేరుతో మంజీరా ఇసుక అక్రమంగా త్రవ్వకాలు జరుగుతుందని మండిపడ్డారు. టిఎండిసి ఆధ్వర్యంలో పట్టా భూముల పేరుతో ఇష్టానుసారంగా జరుగుతున్న ఇసుక త్రవ్వకాలవల్ల మంజీరా నది ప్రాంతం అంతా ఎడారిగా ఉన్న పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. రాజస్థాన్ లాగా పోతంగల్ మంజీరా నది పరిస్థితి మారిపోయిందని వారు మండిపడ్డారు. మంజీరా సరిహద్దు ప్రాంతంలో నిబంధనకు విరుద్ధంగా అత్యంత లోతులో ఇసుక త్రవ్వకాలు చేయడమే కాకుండా భూగర్భ జలాలు అడుగంటి విధంగా త్రవ్వకాలు చేయడం వల్ల ఆ పరిసర ప్రాంతాలు ఎడారిగా మారిపోయే పరిస్థితులు ఉంటాయి అని అన్నారు. బ్రిడ్జికి 1000 మీటర్ల





దూరంలో ఇసుక త్రవ్వకాలు చేయాల్సి ఉండగా బ్రిడ్జికి దగ్గరగా ఇసుక త్రవ్వకాలు చేస్తున్నారని అదేవిధంగా, ఫిల్టర్ వాటర్ ట్యాంకులకు దగ్గర్లో త్రవ్వకాలు చేయడం ఏమిటని వారు ప్రశ్నల వర్షం కురిపించారు. పొతంగల్ మండల కేంద్రంలోని ఓ పట్టాకు ఒక సీటు ఉండగా మరో పట్టాకు రెండు ఫీట్ల లోతు ఉండాల్సి ఉండగా సుమారు 20 ఫీట్ల లోతులో త్రవ్వకాలు చేస్తున్నారని భూగర్భ జలాలు అడుగంటి పోయే విధంగా త్రవ్వకాలు చేయడం చాలా దారుణం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీలతో పనులు చేయాల్సి ఉండగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను నింపాల్సి ఉండగా, అలా కాకుండా నిబంధనకు విరుద్ధంగా, జెసిబి ల ద్వారా ఇసుక త్రవ్వడం చాలా దారుణమని వారు మండిపడ్డారు. ప్రతిరోజు సుమారు 400 నుంచి 500 వరకు టిప్పర్లు లారీలు రోడ్ల ద్వారా ఊరి ప్రధాన రహదారుల ద్వారా వెళ్లడం వల్ల రోడ్లు ధ్వంసం అవుతున్నాయని కంటికి కొనుక్కు లేకుండా ప్రజలకు అవుతుందని అన్నారు. పగలు రాత్రి అని తేడా లేకుండా ఇసుకను తరలిస్తున్నారని అన్నారు. సాయంత్రం ఐదు గంటల వరకే రవాణా చేయాల్సి ఉండగా రాత్రి ఒంటిగంట వరకు ఇసుక రవాణా చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. ప్రధాన రహదారి పక్కనే రైతులు పండించిన ధాన్యం ఆరబోయడానికి కల్లాలు లేకపోవడంతో దాన్యం ఆరబోయడం జరిగిందని ఈ లారీలు వెళ్లడం వల్ల ధాన్యం మొత్తం పనికి రాకుండా పోయిందని దీంతో రైతులు తీవ్ర నష్టపోవడం జరుగుతుందని అన్నారు. రైతుల పంట పొలాల్లో 25 ఫీట్ల లోతుల్లోనే బోరు నీరు పడడం జరిగేది అని ప్రస్తుతం 75 ఫీట్లు త్రవ్విన నీరురాని పరిస్థితి ఏర్పడిందని భూగర్భ జలాలు అడుగంటి పోయాయని దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ట్రాక్టర్లకు ఇసుక తరలించే అవకాశం ఇవ్వకుండా చేయడం చాలా దారుణం అని దీంతో చాలామంది ఉపాధి లేక ఇబ్బందుల పాలు అవుతున్నారని అదేవిధంగా ఇసుక అవసరం ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని అన్నారు. రెవెన్యూ శాఖ పోలీస్ శాఖ మైనింగ్ శాఖ అధికారులు రోడ్డు రవాణా శాఖ అధికారులు ఆర్టీవో అధికారులు వీరితోపాటు ఇంకొన్ని శాఖల అధికారులు మామూళ్ల మత్తులో మునుగు తున్నారని, ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా మర్చిపోవటం జరిగిందని మండిపడ్డారు. అదేంటని ప్రశ్నించిన వారిపై కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా దౌర్జన్యం చేస్తున్నారని అక్రమ కేసుల పేరుతో ఇబ్బందుల పాలు చేస్తున్నారని గతంలో అక్రమ ఇసుకను ఆపి ప్రశ్నించిన పాపానికి గ్రామంలోని రైతులపై అక్రమ కేసులు బనయించడం సిగ్గుచేటని బిజెపి పార్టీ నాయకులు అన్నారు. పోతంగల్ మండల కేంద్రం కు ఆనుకొని పొతంగల్ మంజీరా సరిహద్దు ప్రాంతం తో పాటు పక్కనే కొడిచెర్ల మంజీరా సరిహద్దు ప్రాంతంలో కొనసాగుతున్న ఇసుక త్రవ్వకాలకు పక్కనే వే బ్రిడ్జి ఉండాల్సి ఉండగా అలా కాకుండా నిబంధనకు విరుద్ధంగా గ్రామంలో ఏర్పాటు చేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఇప్పటికైనా అక్రమ ఇసుక రవాణాను ఆపాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని అవసరమైతే సెంట్రల్ మైనింగ్ శాఖ మంత్రిని పిలిపించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని అన్నారు. పట్టా భూములు అని చూపుతూ పొలం చదును చేసుకుంటూ అభివృద్ధి చేసుకుంటామని ఇసుక త్రవ్వకాలకు పర్మిషన్ తెచ్చుకుని కొంతమంది రాజకీయ అండదండలు ఉన్నవారు. బడాబాబులు, వారి పట్టా భూములను వదిలి మంజీరా నదిలో కొచ్చి ఇష్టానుసారంగా ఇసుక త్రవ్వకాలు చేయడం చాలా దారుణం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అక్రమ ఇసుక దందాను ఆపాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరికలు చేశారు. అంతేకాకుండా వే బిల్లులు లేకుండా, కొన్నిటికి వే బిల్లు లు నెల వరకు ఇస్తూ, తప్పుడు వేబిలుల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తూ, వాల్టా చట్టానికి తూట్లు పొడవటమే కాకుండా కోట్లకు పరిగెడుతూ ప్రభుత్వా ఆదాయానికి గండి కొడుతున్నారని వారు మండిపడ్డారు.

# కాణిపాకం వరసిద్ధిని సేవలు సుప్రీంకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం మే 3 (జన సంఘర్షణ)

భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ కుటుంబ సమేతంగా ఆదివారం వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన ఆలయ ఏఈఓ రవీంద్రబాబు. ఈకార్యక్రమంలో చిత్తూరు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి అరుణాసారిక న్యాయమూర్తులు, చిత్తూరు డి.ఎస్.పి వెంకటనారాయణ, సి.ఐ శ్రీధర్ నాయుడు, కాణిపాకం ఎస్.ఐ, నరసింహులు, సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి, చిత్తూరు కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# కాణిపాకం వరసిద్ధిని సేవలో శాసనమండలి సభ్యులు మాధవరావు

కాణిపాకం మే 3(జన సంఘర్షణ)



రాష్ట్రశాసనమండలి సభ్యులు టి. మాధవరావు ఆదివారం కాణిపాకం వినాయక స్వామిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన ప్రోటోకాల్ ఏఈఓ ధనపాల్. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

# మోహన్ మురళికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన కూటమి నాయకులు

వెదురుకుప్పం. (జన సంఘర్షణ)




వెదురుకుప్పం టిడిపి మండల అధ్యక్షులు మోహన మురళి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్న టిడిపి తమ్ముళ్లు, కూటమి నాయకులు మోహన మురళికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన మండల టిడిపి ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ రెడ్డి, మండల బిజెపి అధ్యక్షుడు అశోక్ రెడ్డి, ఎస్ఆర్ పురం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేవరాజుల నాయుడు, టిఎన్టిసి నియోజకవర్గ అధ్యక్షులు గాలి బాబు నాయుడు, క్లస్టర్ కన్వీనర్ రమణారెడ్డి క్లస్టర్ కన్వీనర్ చంద్రబాబు రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ లు వరప్రసాద్, బాలాజీ రెడ్డి, లక్ష్మీరెడ్డి, క్లస్టర్ కో కన్వీనర్, బండి పరమేశ్వర్ రెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి యూనిట్ కన్వీనర్ భాస్కర్ రెడ్డి, కిరణ్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు అక్కిం, మధు, మండల కార్యదర్శి విక్రం రెడ్డి మండల కార్యనిర్వాహక కార్యదర్శి చిరంజీవి నాయుడు, మండల కార్యదర్శి మునికృష్ణారెడ్డి, మండల కార్యదర్శి మొగిలయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు నాదముని రెడ్డి,కోదండ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రామయ్య, జయరామ్, అమర్నాథ్ రెడ్డి, దుద్దాల బాబునాయుడు, రామకృష్ణారెడ్డి, మోహన్, అనుభరాశి, గుణశేఖర్, వెంకటాద్రి నాయుడు, మాజీ సర్పంచ్ అబ్బులరెడ్డి, నాయకులు వెంకటేష్ దాము బిజెపి నాయకుడు శంకర్ రెడ్డి, జనసేన మండల ప్రధాన కార్యదర్శి ముని మాజీ సర్పంచ్ గంగాధరం, బూత్ కన్వీనర్ భరత్, నాగరాజురెడ్డి, రాంబాబురెడ్డి, కిషోర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రాజాజీ, శివకుమార్, విజయ నరసింహారెడ్డి విశ్వనాథరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి ఢిల్లీ ప్రసాద్ రెడ్డి, అసోక్యాదవ్ భూపతి, ప్రశాంత్, యోగి, వెంకటేష్, గాంధీ విక్కీ, నవీన్, తిరుమల, కృష్ణారెడ్డి, కెసి రెడ్డి, పరమేష్, శ్రీరామ్ వర్మ ఏకాంబరం, కతార్ చంద్ర, జిఎంకే చంద్ర, దాము తదితరులు పాల్గొన్నారు.

# అయ్యన్నకుంటు చెరువు దుస్థితి పట్టించుకోండి మహాప్రభు

- అక్రమణులు తొలగించి పుణ్యం కట్టుకోండి రెవిన్యూ శాఖ మంత్రికి రైతులు మొర.

బైరెడ్డిపల్లి (జన సంఘర్షణ)



బైరెడ్డిపల్లి మండలంలోని తీర్థం గ్రామ రెవిన్యూ పరిధిలో కల అయ్యన్నకుంటు చెరువు ఆక్రమణలు గురై ఆక్రమణదార్ల చర్యలవల్ల నిండిన చెరువు నెల రోజుల్లో ఎండిపోయిన విచిత్ర దుస్థితి నెలకొన్నది అని ఈ చెరువు ఆక్రమణలు తొలగించి చెరువును కాపాడాలని, రాష్ట్ర రెవిన్యూ శాఖామంత్రి అనగాని సత్య ప్రసాద్ కు తీర్థం రైతు,విశ్రాంత బ్యాంక్ మేనేజర్ వేణుగోపాల్ గుప్త, రైతులు మొరపెట్టుకున్నారు. ఈ చెరువు సర్వే నెంబర్ 103 లో 5 ఏకరముల 43 సెంట్లు విస్తీర్ణం కలదు.నేడు పలువురు ఆక్రమణలు చేపట్టడం తో కేవలం 3 ఎకరాలకు పరిమితము అయినది.ఈ చెరువులో నాలుగు 5 చోట్ల 20 అడుగుల లోతు గుంతలు త్రవ్వి వేయడంతో చెరువులోని వచ్చిన నీరు ఉటలు ద్వారా లోపల పొలంలో ప్రవహించి నెల రోజుల్లో చెరువు నీరు ఇంకిపోయింది. ఆక్రమణదార్ల అక్రంగా తవ్విన భావులకు ఏకంగా కరెంటు మోటార్లు పెట్టి చెరువు నీటిని అక్రంగా తరలిస్తున్నారు. ఈ బావులకు విద్యుత్ శాఖ విద్యుత్ సర్వీస్ ఇవ్వడం గమనార్హం. చెరువులో మట్టిని జే.సి.బి.లతో తరలించి ఇటుకలు తయారీకి వినియోగిస్తున్నారు.చెరువులో ఏకంగా రోడ్డు ఏర్పాటు కూడా కొనసాగిన పట్టించికొనే వారు లేరని రైతులు ఆరోపిస్తున్నారు. చెరువు నీటితో నిండినదని పంటలు ను ఆయకట్టుదార్లు ప్రారంభించి ఆక్రమణదార్ల తీరువల్ల నేడు రైతుల పంటలు ఎండిపోతున్నాయి. ఈ చెరువు ఈ విధంగా ఆక్రమణదార్ల దుస్థితి తీసుకొచ్చిన పంచాయితీ కార్యదర్శి గాని,రెవిన్యూ అధికారులు పట్టించుకోక నిర్లక్ష్యం చేస్తున్నారని కావున మీరు ఈ సమస్యలు పై స్పందించి అయ్యన్నకుంటు చెరువును కాపాడి రైతులకు న్యాయం చేయాలని వారు మంత్రికిపంపిన ఫిర్యాదులో రైతులు కోరుతున్నారు.

# బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

**- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్**

**నారాయణపేట, మే 3**

జిల్లాలో బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి కలిసికట్టుగా ముందుకు రావాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల్యవివాహాలు చట్టపరంగా నిషేధించబడినవని, 18 సంవత్సరాల లోపు బాలికలు మరియు 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహం జరపడం చట్ట ప్రకారం నేరమని స్పష్టం చేశారు.బాల్య వివాహాలు బాలల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపడమే కాకుండా, వారి విద్యాభ్యాసాన్ని మధ్య లోనే నిలిపివేసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికల భవిష్యత్తు, ఆర్థిక స్వావలంబన, ఆరోగ్య భద్రతపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని తెలిపారు. సమాజంలో అజ్ఞానం, సంప్రదాయాల పేరుతో ఇలాంటి ఘటనలు జరు గుతుండటం ఆందోళనకరమని అన్నారు.తల్లిదండ్రులు, బం ధువులు, గ్రామ పెద్దలు మరియు స్థానిక నాయకులు చట్టా లపై అవగాహన పెంపొందించుకుని బాల్యవివాహాలను నిరో ధించడంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. విద్యా ర్థులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, తమపై బలవంతంగా వివాహం జరపడానికి ప్రయత్నిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు.అంగన్వాడీ సిబ్బం ది, ఆశా వర్కర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా సం ఘాలు మరియు స్వచ్ఛంద సంస్థలు కలిసి గ్రామస్థాయిలో అవగాహన



కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బాల్యవివాహాల నిరోధానికి ప్రభుత్వ శాఖలన్నీ సమన్వ యంతో పనిచేయాలని అన్నారు.ఎవరైనా బాల్యవివాహం జరుగుతున్నట్లు గమనించినట్లయితే సమీప పోలీస్ స్టేషన్, డయల్ 100 లేదా చైల్డ్ హెల్ప్లైన్ 1098కు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. బాలల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ,"బాల్యవివాహాలకు చెక్ బాలల భవిష్యత్తుకు సెక్యూర్" అనే సందేశాన్ని సమాజానికి అందించారు.


# నిజామాబాద్ జిల్లాలో రామయ్య తలంబ్రాల పంపిణికి శ్రీకారం

**భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు**

**గోటి తలంబ్రాలు అందించిన వారికి తిరిగి కల్యాణ తలంబ్రాలు**

**నిజామాబాద్ మే 3 :**

నిజామాబాద్ జిల్లాలో భద్రాచల ముత్యాల తలంబ్రాల పంపిణి కార్యక్రమం సోమ వారం నుండి 5రోజుల పాటు జరుగు తుందని శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామ కోటి రామరాజు తెలిపారు. నిజా మాబాద్ జిల్లాలోని పలు ప్రాం తాల నుండి భద్రాచల రామయ్య కల్యానానికి గోటి తలంబ్రాలు అందిం చారని తిరిగి వారికి కల్యాణ తలంబ్రాలు అందిం చనున్నామని తెలిపారు. భక్తులం దరికి తలంబ్రాల విశిష్టత, వాటి పవిత్రత తెలియజేసి అందజే యనున్నట్లు సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు తెలిపారు. భక్తులందరు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.



# చేనేత రుణమాఫీలో చేతివాటం....

**మధ్యవర్తులతో అధికారుల దోపిడీ.....**

**ఇదెక్కడి న్యాయం అంటున్న లబ్ధిదారులు.....**

**కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్....**

**రాజాపేట మే 3 :**

రాజపేట మండలంలోని ఏడు గ్రామాలలో చేనేత కార్మికులకు మంజూరి అయిన రుణమాఫీ విషయంలో అధికారులు తమ చేతివాటం ప్రదర్శించారు. ఆదివారం లబ్ధిదారులైన చేనేత కార్మికులు తమ గోడును విలేకరులకు వెళ్ళబుచ్చుకున్నారు. లక్ష లోపు రుణాల మాఫీ ప్రభుత్వం ప్రకటించగా సంబంధిత చేనేత జౌళిశాఖ అధికారులు పర్సంటేజీ ఇస్తేనే చెక్కులు అందజేసినట్లు ఆరోపిస్తున్నారు. రాజపేట మండలంలోని రఘునాథపురం, చల్లూరు, బొందుగుల, సోమవారం, రేణికుంట, దూది వెంకటాపురం, బేగంపేట, రాజపేట గ్రామాలలో చేనేత కార్మికులకు రుణమాఫీ అయింది. 2017 నుండి 2024 మార్చి 31 వరకు లక్షల లోపు రుణాలున్న కార్మికులకు ఇది వర్తించగా సుమారు 150 మందికి పైగా రుణమాఫీ జరిగినట్లు కార్మికులు చెబుతున్నారు. కాగా ఇట్టి రుణమాఫీ వర్తించేందుకు సంబంధిత చెక్కులు అధికారులు ఇచ్చేందుకు పలు గ్రామాలలో మధ్యవర్తులను ఏర్పాటు చేసుకున్న అధికారులు ఒక్కొక్కరి నుండి 5000 రూపాయలు కచ్చితంగా వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయాల చుట్టూ నెలలపాటు తిప్పించుకొని మధ్యవర్తులకు ముడుపులు ఇచ్చిన తర్వాతే తమకు రుణమాఫీ జరిగిందని చేనేత కార్మికులు వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా చరచూపి విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని చేనేత కార్మికులు కోరుతున్నారు.

# కార్యకర్త కుటుంబానికి సహాయ హస్తం చాచిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి.

**- వివాహానికి పుస్తె మట్టెలు, ఆర్థిక సాయం అందజేత.**

**దౌల్తాబాద్ మే 3**

దౌల్తాబాద్ మండలం శేరిపల్లి బందారం గ్రామంలో చోటుచేసుకున్న విషాద ఘటన స్థాని కంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జక్కుల స్వామి రోడ్డు ప్రమా దంలో మృతి చెందగా, కొద్ది కాలానికే ఆయన కుమారుడు కూడా అనారోగ్యంతో కన్నుమూయడం కుటుం బాన్ని దుర్భర పరిస్థితుల్లోకి నెట్టింది. కుటుంబానికి ఆధారం గా ఉన్న ఇద్దరు సభ్యులను కోల్పోవడంతో ఆయన భార్య పేదరికంలోనే కుమార్తెను పోషిస్తూ జీవనం సాగిస్తోంది.ఈ క్రమంలో కుమార్తె వివాహం నిర్వహించడం భారంగా మారడంతో ఈ విషయాన్ని దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలిసిన వెంటనే ఆయన మానవతా దృక్పథంతో స్పందించి, యువతి కి వివాహానికి అవసరమైన పూస్తే మట్టెలతో పాటు రూ.25,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు.ఈ సందర్భం గా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీకి సేవలందిం చిన కార్యకర్త కుటుంబాలను ఆదుకోవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తల కుటుంబాలకు అండగా



ఉంటుందని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో కూడా ఈ కుటుంబానికి అవసరమైన సహా యం అందిస్తామని హామీ ఇచ్చారు. కష్టాల్లో ఉన్న ప్రజలకు చేయూతనివ్వడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పడాల రాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఐలాపురం కనకయ్య, వైస్ చైర్మన్ మద్దెల స్వామి, సీనియర్ నాయకులు కర్నాల శ్రీనివాసరావు, టైలర్ రమేష్, టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి గణేష్ పంచమి, మండల ప్రధాన కార్యదర్శి జనగామ మల్లారెడ్డి, ఏఎంసి డైరెక్టర్ అన్నారెడ్డి సంపత్ రెడ్డి, దౌల్తాబాద్ ఉప సర్పంచ్ ఆది బాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు యేసు, దుబాషి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాన్ని ప్రేమిస్తూ.......

- **ఉద్యోగుల కోసం పోరాటం చేస్తూ....**
- **15 సంవత్సరాల శ్రమ ఫలితం...**
- **ఇంజ మహేష్ కు శ్రమశక్తి అవార్డు......**
- **పూర్తి పేరు: ఇంజ మహేష్**
- **తల్లిదండ్రులు: లక్ష్మి, నరసయ్య**
- **పుట్టిన తేదీ: జనవరి 09,1988**
- **కులం: ఎస్సీ ( మాదిగ)**
- **ప్రస్తుత పదవి: ఐ ఎన్ టి యు సి-327 యాదాద్రి భువనగిరి జిల్లా ట్రెజరర్**
- **విద్య అర్హతలు: ITI, డిగ్రీ బీకాం**
- **గ్రామం: కాల్వపల్లి**
- **మండలం: రాజాపేట**
- **నియోజకవర్గం: ఆలేరు**
- **జిల్లా: యాదాద్రి భువనగిరి**
- **ఫోన్ నెంబర్: 7893894184....**






**రాజాపేట,మే 3 :**

అతిపెద్ద దళిత కుటుంబంలో జన్మించిన పెద్ద మనసు గల ఇంజ మహేష్ చిన్నప్పటినుండి కష్టపడి పనిచేసే వ్యక్తిత్వంతో పాటు ఇతరుల కోసం ఆలోచించి సాయం చేసే మంచి మనస్కుడు. ఏ సందర్భంలోనైనా అట్టి పరోపకార సేవను వదిలిపెట్టక పోవడం తో నేడు శ్రమశక్తి అవార్డుకు అర్హత పొందాడు. ఉద్యోగ జీవిత విధానం పరిశీలిస్తే మొట్టమొదటిగా , 04 జనవరి 2011 న రాజాపేట మండలం పాముకుంట సబ్ స్టేషన్ లో, ఆపరేటర్



**ఈరోజు పాల్వంచలోని.. ఖురా లో.. జరిగిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న.. భువనగిరి డివిజన్ చైర్మన్.. ఇంజ మహేష్...**

గా ఉద్యోగం చేరాడు . 2011 నుండి ఔట్సోర్సింగ్ విధులు నిర్వహిస్తూ, 2016లో ఐ ఎన్ టి యు సి-327 యూనియన్ లో జాయిన్ అయ్యాడు. అనంతరం ఆలేరు సబ్ డివిజన్ లీడర్ గా ఎన్నుకున్నారు. 2017 న ఔట్సోర్సింగ్ ఉద్యోగం కాస్త ఆర్టిజన్ గా మార్చారు. 2020 సంవత్సరంలో తాను యూనియన్ కి, కార్మికులకు చేసిన సేవలను గుర్తించి , భువనగిరి డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నుకున్నారు. ఆ తర్వాత ఆర్టిజన్ల గురించి నిత్యం పోరాడుతున్నాడని గుర్తించి, 2025 వ సంవత్సరంలో యాదాద్రి భువనగిరి జిల్లా ట్రెజరర్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల జరిగిన ఆర్టిజన్ కార్మికుల సమ్మెకు, రాష్ట్ర కమిటీ మేరకు, మహేష్ కు భువనగిరి డివిజన్, తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్, జాయింట్ యాక్షన్ కమిటీ భువనగిరి డివిజన్ చైర్మన్గా ఎన్నుకున్నారు. ఆర్టిజన్ కార్మికుల వెంట ఉండి, శాంతియుతంగా, జరిగిన పది రోజుల సమ్మెకు పూర్తి బాధ్యత వహించి, సమ్మె సక్సెస్ చేసాడు .2016 నుండి 2026 వరకు అనునిత్యం కార్మికుల కోసమే కష్టపడుతున్నానని తెలిసి, యూనియన్ కంపెనీ నాయకులు, రాష్ట్ర నాయకులు 1 మే 2026న, కార్మికుల దినోత్సవం పురస్కరించుకొని, ఇంజ మహేష్ ను శ్రమశక్తి అవార్డు గ్రహీతగా ఎన్నుకున్నారు. ఇలా ఇంజ మహేష్ వృత్తిలో పరిణతి చెందుతూ, నమ్ముకున్న సంఘాన్ని కార్మికుల కోసం నిత్యం ఆలోచిస్తూ పోరాటాలు ఉద్యమాలు నడుపుచు ఉద్యోగరీత్యా సంఘపక్షాన ఉన్నత పదవులు అధిరోహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చే శ్రమశక్తి అవార్డును అందుకోవడం పట్ల ప్రతి ఒక్కరు ఆయనను అభినందించారు. ఇంతటితోనే ఆగకుండా ఉద్యోగ, నాయకత్వ రీత్యా మరిన్ని శిఖరాలు మహేష్ తప్పకుండా అధిరోహిస్తారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
ఆదివారం
03 మే 2026

# "విజేతలకు గ్రామాభిమాన సత్కారం"

**- పట్టుదలకి ప్రతిఫలం - విద్యార్థులకు ఘన సన్మానం"**

**-గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి**






**మక్తల్, మే 3**

మక్తల్ మండలంలోని మాధ్వార్ గ్రామంలో విద్యా ప్రాధాన్యతను ప్రతిబింబించే విధంగా గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఘనంగా అభినందన సన్మాన సభ నిర్వహించారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో విజయాన్ని సాధించిన సుమారు 50 మంది విద్యార్థులను శాలువాలతో సత్కరించి, ప్రోత్సాహకంగా రామకృష్ణ మఠం వారు ప్రచురించిన "మేలుకో నేస్తమా" అనే పుస్తకాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శివశంకర్ మాట్లాడుతూ, విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్ కెరీర్పై సమగ్ర మార్గదర్శకత్వం అందించారు. SSC, ఇంటర్ తర్వాత అందుబాటులో ఉన్న వివిధ కోర్సులపై అవగాహన కల్పిస్తూ, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి అవసరమైన నైతిక విలువలు, మంచి అలవాట్లు, సానుకూల దృక్పథం, మంచి స్నేహితుల ప్రాధాన్యతను వివరించారు. లక్ష్య సాధనకు ఆత్మవిశ్వాసం ముఖ్యమని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కవి కాళోజీ నారాయణరావు గారి "పుట్టుక నీది, చావు నీది, బ్రతుకంత దేశానిదే" అనే స్ఫూర్తిదాయకమైన మాటలను గుర్తు చేస్తూ, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థులను ప్రేరేపించారు. గ్రామ పెద్దలు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షిస్తూ, ఉన్నత విద్య కోసం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అంబేద్కర్ సంఘం నాయకులు మరియు లతారాజా ఫౌండేషన్ వరి"డా. అంబేద్కర్ ఎవరు? ఆయన ఏం చేశారు? భారత భాగ్య విధాత బాబాసాహెబ్ జీవితం -- కార్యాచరణ" అనే పుస్తకాన్ని విద్యార్థులకు బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రిటైర్డ్ హెచ్ఎం జగదీష్ కుమార్, జంగం బసవరాజ్, పాఠశాల హెచ్ఎం వెంకట్రాములు, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు ఉప సర్పంచ్ శివాని, డాక్టర్ ఆశప్ప, బాట నరసింహ, గణపురం నగేష్, కురువ మల్లేష్, బాట జయమ్మ, గుడిసె తిమ్మయ్య, గాల్ల రాములు, బిచ్చలి బ్యాంకు నరసింహ, పంచాయతీ కార్యదర్శి నస్లాయి తిమ్మయ్య నస్లాయి, నాగరాజు, ఆర్ఎంపీ రామకృష్ణ, శివపుల్ల లక్ష్మయ్య, వడ్ల భాను ప్రసాద్, బుడబోయి చంద్రప్ప, పోలీస్ లక్ష్మారెడ్డి గుడిసె రాజు, బాట రాజు,బాట బీమాప్ప, జంగం నరసింహులు తదితరులు, గ్రామ యువకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వృద్ధురాలు మనస్థాపంతో మృతి

**నర్వ మే3**



మండల పరిధిలోనిపాతేర్చెడ్ గ్రామంలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్.ఐ పబ్బతి రమేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతేర్చెడ్ గ్రామానికి చెందిన రోడ్డపొల్ల సాయమ్మ అలియాస్ కొత్తపల్లి సాయమ్మ (63) మే 1వ తేదీన గ్రామంలో జరిగిన శ్రీ ఆంజనేయ స్వామి ఉత్సవాల సందర్భంగా శనివారం రాత్రి గుడిలోనే నిద్ర చేస్తానని తన కుటుంబ సభ్యులకు తెలిపింది. అయితే కుటుంబ సభ్యులు శనివారం వద్దు, మంగళవారం రోజు వెళ్ళమని సూచించారు. ఈ విషయంలో మనస్తాపానికి గురైన సాయమ్మ, మే 2వ తేదీ సాయంత్రం 5:30 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి బయటికి వెళ్ళిపోయింది. ఆమె గుడికే వెళ్లి ఉంటుందని కుటుంబ సభ్యులు భావించారు. కాగా, ఈరోజు (ఆదివారం) ఉదయం గ్రామంలోని చెరువులో ఒక గుర్తు తెలియని మహిళ శవం తేలుతున్నట్లు సమాచారం రావడంతో, సాయమ్మ కుమారుడు రోడ్డపొల్ల నరసింహులు అక్కడికి వెళ్లి చూడగా, అది తన తల్లి సాయమ్మ మృతదేహంగా గుర్తించాడు. గుడికి వెళ్లే విషయంలో గొడవ జరగడంతో మనస్తాపం చెంది సాయమ్మ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు కుమారుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. తమకు ఎవరిపైనా అనుమానం లేదని ఆయన తెలిపారు. నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ పబ్బతి రమేష్ వెల్లడించారు.

# అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్యకు పరిష్కారం - కౌన్సిలర్ మౌనిక దినేష్





**మే 3:**

అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యకు కౌన్సిలర్ మౌనిక దినేష్ ఆధ్వర్యంలో తక్షణ చర్యలు చేపట్టారు. చెర్మన్ శిరీష కృష్ణ రెడ్డి, పాలక వర్గం మరియు అధికారుల సహకారంతో పలు ప్రాంతాల్లో బోర్ ఫ్లషింగ్ నిర్వహించి, కొత్త మోటార్ను అమర్చడం ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక అడుగు వేశారు. ఈ పనులు విజయవంతంగా పూర్తవడంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. నీటి సరఫరా మెరుగుపడటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ, ఈ చర్యలు చేపట్టిన మున్సిపల్ అధికారులు మరియు ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. మౌనిక దినేష్ మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# చిట్యాల లో రాజకీయ సెగలు:

**ఫ్లెక్సీల చించివేత.. మాజీ ఎమ్మెల్యే అనుచరులపై కాంగ్రెస్ ఫైర్:**





**చిట్యాల, మే 3**

చిట్యాల మున్సిపాలిటీలో రాజకీయ సెగలు రాజుకున్నాయి. కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించివేయడం పట్టణంలో ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఘటనపై కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులను ఫిర్యాదు చేశారు. 8వ వార్డు కౌన్సిలర్ కుక్కల మోహన్, కాంగ్రెస్ నాయకుడు కమ్మంపాటి సతీష్ కలిసి ఈ ఘటనపై చిట్యాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బిఆర్ఎస్ నాయకులే ఉద్దేశపూర్వకంగా ఈ పని చేశారని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రోద్బలంతోనే ఆయన అనుచరులు ఈ అరాచకానికి పాల్పడ్డారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి చిల్లర పనులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఎనిమిదో వార్డ్ కౌన్సిలర్ కుక్కల మోహన్ మాట్లాడుతూ ఒక దళిత కౌన్సిలర్ను కావడం, శ్రీ బాల నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడం గిట్టని వారు నా ఫోటో ఉన్న ఫ్లెక్సీలను చించివేశారు అని కౌన్సిలర్ కుక్కల మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం రాజకీయ దాడే కాకుండా, సామాజిక వివక్షను కూడా సూచిస్తోందని ఆయన ఆరోపించారు. చిల్లర రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్గా చిరుమర్తి లింగయ్య మారుతున్నారని, అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో ప్రజలే ఆయనకు తగిన బుద్ధి చెబుతారని వారు హెచ్చరించారు. .

# ఉప్పల్ జై భీమ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**మే 03 ఉప్పల్:**

ఉప్పల్ జై భీమ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు సమక్షంలో కొత్త కమిటీని ప్రకటించారు. గౌరవ సలహాదారులుగా డాక్టర్ బి. సత్తయ్య, బి. రామయ్యలను ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షులుగా ఎర్ర బాలరాజు బాధ్యతలు స్వీకరించగా, అధ్యక్షుడిగా రాపోలు రవీందర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జోన్నపల్లి క్రాంతి రాజు, వి. వెంకటేశ్ మహారాజ్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా మస్క ధన్ రాజు, సహాయ కార్యదర్శిగా ఆస్క సురేష్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా డి. సాయి ప్రసాద్, బొప్పెన శ్రీధర్ బాధ్యతలు చేపట్టారు. కార్యవర్గ సభ్యులుగా ఒక్కసు బలనార్సింహ, మస్క సుధాకర్, గుండే రాజు, మీసాల జంగయ్యలను ఎన్నుకున్నారు.

# మోదీ బహిరంగ సభను విజయవంతం చేయండి:

**బిజెపి మండల అధ్యక్షుడు పీక వెంకన్న:**

**చిట్యాల, మే 3**

మే నెల 10వ తేదీన సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్లో నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బిజెపి మండల అధ్యక్షుడు పీక వెంకన్న పిలుపునిచ్చారు. ఆదివారం చిట్యాల మండలం పెద్ద కాపర్తి గ్రామంలో బిజెపి మండల అధ్యక్షుడు పీక వెంకన్న అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఉపాధ్యక్షుడు, మండల ఇన్చార్జ్ షాగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ. ప్రధాని మోదీ రాక సందర్భంగా బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co